


RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక




సంచిక : 252 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | గురువారం | 01-01-2026 పేజీలు-8 | వేల: రూ. 5.00

# 2025కు వీడ్కోలు

- భారత రాజకీయాల్లోకి ట్రంప్ టారిఫ్‌లు
- భౌగోళిక రాజకీయ మార్పులు, సంఘర్షణలు,
- ప్రపంచంలో ఎన్నో ఘటనలు, మరెన్నో కీలక ఘట్టాలు



న్యూఢిల్లీ డిసెంబర్ 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
2025వ సంవత్సరంలో.. భారతదేశంతో పాటు ప్రపంచంలో ఎన్నో ఘటనలు, మరెన్నో కీలక ఘట్టాలు చోటుచేసుకున్నాయి. భౌగోళిక రాజకీయ మార్పులు, సంఘర్షణలు, ఈసీ సర్ ఎఫెక్ట్, వాతావరణ ఘటనలు జరిగాయి. ప్రజా భద్రత గురించి మొదలైన ప్రశ్నలు తొక్కిసలాట ఘటనలు, ప్రమాదాలు, నేరాలతో కొనసాగాయి. ప్రకృతి వైపరీత్యాలు, ఉగ్రవాద దాడులు, దేశాల మధ్య యుద్ధాలు, -మిగతా 2 లో

## ప్రళయ్ క్షిపణిని విజయవంతంగా
# పరీక్షించిన భారత్

- రెండు క్షిపణులను ఒకేసారి పరీక్షించిన డీఆర్‌డీవో
- లక్ష్యాలను కచ్చితత్వంతో చేధించాయని అధికారులు వెల్లడి
- 'ప్రళయ్' క్షిపణి 150 నుంచి 500 కిలోమీటర్ల పరిధిలోని లక్ష్యాలను ఛేదించగలదు



న్యూఢిల్లీ -డిసెంబర్ 31 (నేటి దర్శిని):
భారత రక్షణ రంగం మరో కీలక మైలురాయిని చేరుకుంది. ఒడిశా తీరం లో ఉపరితలం నుంచి ఉపరితలానికి ప్రయోగించే స్వల్ప శ్రేణి బాలిస్టిక్ క్షిపణి 'ప్రళయ్ ని విజయవంతంగా పరీక్షించింది. ఒకే లాంచర్ నుంచి రెండు క్షిపణులను స్వల్ప వ్యవధిలో ప్రయోగించి వాటి సామర్థ్యాన్ని విజయవంతంగా పరిశీలించింది. -మిగతా 2 లో




## మూడో వారంలో
# మున్సిపల్ ఎన్నికలు

## 10లోపు ఓటర్ల తుది జాబితా

- 117 మున్సిపాల్టీలు, ఆరు కార్పొరేషన్ల ఎన్నికలకు రంగం సిద్ధం
- అధికారులతో కలిసి ఎన్నికల సంఘం కసరత్తు




హైదరాబాద్ డిసెంబర్ 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
ఇటీవల పంచాయతీ ఎన్నికలను నిర్వహించిన రాష్ట్ర ప్రభుత్వం మున్సిపాల్టీలు, కార్పొరేషన్ల ఎన్నికలపై దృష్టి సారించింది. జనవరి మూడోవారంలో 117 మున్సిపాల్టీలకు, ఆరు కార్పొరేషన్లకు ఎన్నికలు నిర్వహించేందుకు రంగం సిద్ధం చేస్తోంది. దీనికోసం రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో ఎన్నికల అధికారులు కసరత్తు ప్రారంభించారు. కొత్త ఓటర్ల నమోదు, జాబితాపై దృష్టి సారించారు. ఈనెల 10లోపు ఎన్నికల కమిషన్ ఓటర్ల తుది జాబితాను పూర్తి చేయనుంది. -మిగతా 2 లో



# రష్యా అధ్యక్షుడు పుతిన్ నివాసంపై దాడి

- 91 దీర్ఘశ్రేణి డ్రోన్లను ప్రయోగించిన ఉక్రెయిన్
- వీడియో విడుదల చేసిన రష్యా విదేశాంగ శాఖ
- ప్రపంచదేశాల ఆగ్రహం
- దుశ్చర్యకు పాల్పడలేదన్న ఉక్రెయిన్

మాస్కో
ఉక్రెయిన్‌తో జరుగుతున్న ఘర్షణలను ముగించే దిశగా ప్రయత్నాలు జరుగుతున్న సమయంలో రష్యా అధ్యక్షుడు పుతిన్ నివాసంపై దాడి జరిగింది. ఉక్రెయిన్ 91 దీరెశ్రేణి డ్రోన్లను ప్రయోగించిందని రష్యా విదేశాంగశాఖ వెల్లడించిన సంగతి విదితమే. ఈ నేపథ్యంలోనే బుధవారం రష్యా రక్షణశాఖ ఆ ఘటనకు సంబంధించిన వీడియోలను విడుదల చేసింది. ఈ వీడియో ప్రారంభంలోనే ఒక డ్రోన్ కూలిపోయిన ద ృశ్యం కనిపిస్తోంది. నోవ్‌గొరొడ్ ప్రాంతంలో పుతిన్ నివాసంపై ఆదివారం రాత్రి, సోమవారం తెల్లవారుజామున డ్రోన్లతో ఉక్రెయిన్ దాడికి యత్నించిందని రష్యా వెల్లడించింది. ఉక్రెయిన్ ప్రయోగించిన ఈ డ్రోన్లను నిర్వీర్యం చేశామని, నివాసానికి ఎలాంటి నష్టం జరగలేదని పేర్కొంది. ఈ దాడిని ఉగ్రదాడిగా పేర్కొంది. ఉక్రెయిన్‌పై సరైన సమయంలో దాడిచేసే హక్కు తమకు ఉందని, ఇది శాంతి చర్చలకు విఘాతం కలిగించే దాడి అని విదేశాంగశాఖ మంత్రి లావ్రోవ్ హెచ్చరించారు. అయితే ఈ వ్యాఖ్యలను ఉక్రెయిన్ ఖండించింది. ఇదంతా అవాస్తవమని పేర్కొనింది. కాగా.. రష్యా అధ్యక్షుడి నివాసాన్ని లక్ష్యంగా చేసుకున్నారనే -మిగతా 2 లో




# దిగొచ్చిన ఫుడ్ యాప్‌లు

- డెలివరీ బాయ్స్‌కు ప్రోత్సాహకాలు పెంపు
- గిగ్ వర్కర్ల సమ్మె విజయవంతం

న్యూఢిల్లీ
గిగ్ వర్కర్స్ ఇచ్చిన సమ్మె పిలుపునకు ఫుడ్ యాప్ యాజమాన్యాలు దెబ్బకు దిగివచ్చాయి. డెలివరీ బాయ్స్ డిమాండ్‌లకు తలొగ్గి పలు ప్రోత్సాహకాలు అందించడానికి ముందుకు వచ్చాయి. ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ యాప్ బెస్ట్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్, తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్స్ యూనియన్‌లు సమ్మెకు పిలుపునిచ్చాయి. దీంతో ముందు జాగ్రత్తగా వ్యాపారం నష్టపోతామనే భయంతో ఫుడ్ యాప్‌లు పలు ప్రోత్సాహకాలను ప్రకటించాయి. ఈ ప్రభావంతో పలు చోట్ల సమ్మె మిశ్రమంగా జరిగింది. ఏడాది చివరి రోజు ఆటంకం కలగకూడదన్న ఉద్దేశ్యంతో ఫుడ్ డెలవరీ సంస్థలు స్విగ్గీ, జొమాటో, జెప్టో తదితర సంస్థలు పలు ప్రోత్సాహకాలను ప్రకటించాయి. డిసెంబర్ 31న సాయంత్రం ఆరు గంటల నుంచి 12 గంటల మధ్య పనిచేసే గిగ్‌వర్కర్లకు ఒక్కో ఆర్డర్‌కు రూ.120-రూ.150 చెల్లిస్తామని జొమాటో ప్రకటించింది. ఆర్డర్లను బట్టి ఒక్కొక్కరు సగటున రూ.3వేలు ఆర్జించవచ్చని పేర్కొంది. అదే విధంగా కాన్సిలేషన్లు, ఆర్డర్లు -మిగతా 2 లో

# మూడో పక్షం జోక్యం లేదు..

- ఇండోపాక్ మధ్య శాంతి నెలకొల్పేందుకు తాము మధ్యవర్తిత్వం వహించినట్లు ప్రకటించిన చైనా
- ఇండోపాక్ ఉద్రిక్తతలపై చైనా ప్రకటనను తిరస్కరించిన భారత్

2 లో



## మన బడి' బిల్లులు
# వెంటనే ఇవ్వండి

- రూ.512 కోట్ల రెడీ ఫర్ పేమెంట్ బిల్లుల
- చెల్లింపులో ప్రభుత్వ నిర్లక్ష్యం ఎందుకు?
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు నిలదీత
- అసెంబ్లీలో సమస్య లేవనెత్తుతానని తనను కలిసిన ఎంవోఎంబీ కాంట్రాక్టర్లకు భరోసా



హైదరాబాద్ డిసెంబర్ 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
మన ఊరు-మన బడి (ఎంవోఎంబీ) కాంట్రాక్టర్లకు రావాల్సిన బిల్లులను తక్షణమే విడుదల చేయాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రూ.512 కోట్ల రెడీ ఫర్ పేమెంట్ ఉన్న బిల్లుల చెల్లింపులో రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం ఎందుకు? అని నిలదీశారు. కమీషన్ల కోసం బడా కాంట్రాక్టర్ల బిల్లులు రిలీజ్ చేసే రేవంత్‌రెడ్డికి.. చిన్న కాంట్రాక్టర్ల సమస్యలు కనిపించడం లేదా? కమీషన్లు రావని బిల్లులివ్వడం లేదా? అని -మిగతా 2 లో



# జనవరి 6 వరకు అసెంబ్లీ

- నేడు కృష్ణా గోదావరిపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్
- 2న ఉపాధి హామీపై సభలో లఘు చర్చ

హైదరాబాద్-డిసెంబర్ 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
అసెంబ్లీ సమావేశాలు జనవరి 6 వరకు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు తెలుస్తోంది. ఈ అంశంపై బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బీఏసీ)లో స్పష్టత రాలేదు. బీఏసీ సమావేశం అనంతరం బిజినెస్‌కు సంబంధించి స్పష్టమైన ప్రకటన చేస్తారు. అందుకు భిన్నంగా ఈసారి ఎలాంటి అధికార ప్రకటన చేయలేదు. దాంతో ఎన్ని రోజులు నిర్వహిస్తారనే అంశంపై సర్కార్ తీసుకునే నిర?యమే ఫైనల్ కానుంది. అధికారులు చెబుతున్న సమాచారం ప్రకారం జనవరి 6 లేదా 7 వరకు సమావేశాలు నడపనున్నట్టు తెలుస్తోంది. -మిగతా 2 లో

## గోదావరి నీటి మళ్లింపును
# అంగీకరించం

- ఏపీ ప్రతిపాదనలను అడ్డుకుంటాం
- కేంద్రంపై ఒత్తిడితో పాటు న్యాయ పోరాటం చేస్తాం
- నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి



హైదరాబాద్ డిసెంబర్ 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
గోదావరి నీటిని ఆంధ్రప్రదేశ్ ఏ రూపంలో మళ్లించినా అంగీకరించే ప్రసక్తే లేదని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి బుధవారమొక ప్రకటనలో పేర్కొన్నారు. గోదావరి ట్రిబ్యూనల్ 80 టీఎంసీలకు అనుమతిం చిందనీ, అంతకంటే ఒక్క చుక్కనీరు ఎక్కువ తీసుకెళ్లినా ఉపేక్షించబోమని తెలిపారు. తమ ప్రభుత్వం అడ్డుకోవడం వల్లే గోదావరి-బనకచర్ల ప్రాజెక్ట్‌ను ఏపీ ఉపసంహ రించుకుందని వివరించారు. దాని స్థానంలో గోదావరి-నల్లమలసాగర్ ప్రాజెక్ట్‌ను ప్రతిపాదించిందని తెలిపారు. సెంట్రల్ వాటర్ కమిషన్ (సీడబ్ల్యూసీ), గోదావరి వాటర్ డిస్ట్రిబ్యూట్ ట్రిబ్యూనల్ (జీడబ్ల్యూడీటీ), -మిగతా 2 లో

### ప్రళయ్ క్షిపణిని విజయవంతంగా

# పరీక్షించిన భారత్

మొదటి తరువాయి



యూజర్ ఎవాల్యుయేషన్ ట్రయల్స్‌లో భాగంగా ఈ పరీక్షలు నిర్వహించినట్లు రక్షణశాఖ వెల్లడించింది. (బుధవారం) ఉదయం 10:30 గంటల సమయంలో రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ ప్రయోగం జరిగింది. ప్రయోగించిన రెండు క్షిపణులు నిర్దేశిత మార్గంలో ప్రయాణించి, లక్ష్యాలను కచ్చితత్వంతో చేధించాయని అధికారులు తెలిపారు. చాందీపూర్ ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్‌లో మోహరించిన ట్రాకింగ్ సెన్సార్ల ద్వారా క్షిపణి పనితీరును ధృవీకరించుకున్నారు. డీఆర్డీవో సీనియర్ శాస్త్రవేత్తలు, ఆర్మీ, ఎయిర్ ఫోర్స్ ఉన్నతాధికారులు ఈ ప్రయోగాన్ని ప్రత్యక్షంగా వీక్షించారు. 'ప్రళయ్' క్షిపణి 150 నుంచి 500 కిలోమీటర్ల పరిధిలోని లక్ష్యాలను ఛేదించగలదు. ఇది పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన సాలిడ్ ప్రొపెల్లెంట్ క్వాసీ-బాలిస్టిక్ మిసైల్. అత్యాధునిక నావిగేషన్, గైడెన్స్ వ్యవస్థలతో పనిచేసే ఈ క్షిపణి.. వివిధ రకాల వార్‌హెడ్‌లను మోసుకెళ్తూ శత్రువుల స్థావరాలపై విరుచుకుపడగలదు. హైదరాబాద్‌లోని రిసెర్చ్ సెంటర్ ఇమారత్ తోపాటు పలు డీఆర్డీవో ల్యాబ్స్, భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (లాంటి సంస్థల సహకారంతో దీన్ని అభివృద్ధి చేశారు. ఈ ప్రయోగం విజయవంతం కావడంపట్ల రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హర్షం వ్యక్తంచేశారు. సాల్వ్ లాంచ్ విజయవంతం కావడంతో క్షిపణి విశ్వసనీయత నిరూపితమైందని ఆయన పేర్కొన్నారు. ఈ విజయంపై డీఆర్డీవో చైర్మన్ డాక్టర్ సమీర్ వి కామత్ మాట్లాడుతూ.. త్వరలోనే ఈ క్షిపణి వ్యవస్థను సైన్యంలోకి ప్రవేశపెట్టేందుకు సిద్ధంగా ఉన్నామని, ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు తుదిదశలో ఉన్నాయని చెప్పారు.

# 2025కు వీడ్కోలు

మొదటి తరువాయి



అత్యవసర ప్రతిస్పందన వ్యవస్థలు, ప్రపంచ దౌత్యాన్ని ద ృష్టిలో ఉంచుకున్నాయి. రాజకీయాలు దేశీయ కథనానికి కేంద్రంగా మారాయి. ఎన్నికల నిర?యాత్మక ఆదేశాలు..ఆశ్చర్యకరమైన ఫలితాలనిచ్చాయి. అంతర్జాతీయ సంబంధాలు సుంకాలు, యుద్ధాలు, సస్పెండ్ చేసిన ఒప్పందాలు చర్చనీయాంశంగా మారాయి. ఉన్నత స్థాయి శిఖరాగ్ర సమావేశాలు దేశాల మధ్య సంబంధాలను పునర్నిర్మించడంతో ఒత్తిడి , పున?స్థాపన కాలాన్ని చూశాయి. అయితే ఇదే సమయంలో కొన్ని విజయ క్షణాలు కూడా నమోదయ్యాయి. భారతదేశం అంతరిక్ష పరిశోధన, మౌలిక సదుపాయాలు, క్రీడలలో కీలక మైలురాళ్లను గుర్తించింది, పార్లమెంట్, కేంద్ర మంత్రివర్గం మందబలంతో గణనీయమైన సంస్కరణలను ముందుకు తెచ్చింది.

# జనవరి 6 వరకు అసెంబ్లీ

మొదటి తరువాయి



జనవరి 2న ఉపాది హామీపై సభలో లఘు చర్చ జరగనుంది. మహాత్మాగాంధీ ఉపాధి హామీ స్థానంలో కొత్తగా తీసుకొచ్చిన వీబీ జీ రామ్ జీ స్కీం వల్ల తెలంగాణ ఏటా రూ.1,200 కోట్లు నష్టపోనుంది. అలాగే కార్మికుల పనిదినాలు, వేతనాలు, ఇతర అంశాలపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది. వీబీ జీ రామ్ జీ స్కీంను రద్దు చేసి పాత చట్టానే కొనసాగించాలని అసెబ్లీలో తీర్మానం చేయనున్నట్టు సమాచారం. ఈ అంశంపై బీజేపీ మినహా అన్ని పార్టీల సభ్యులు అంగీకారం తెల్పే అవకాశం ఉంది. జనవరి 4న ఆదివారం కావడంతో సభ జరిగే అవకాశాలు తక్కువగా ఉన్న నేపథ్యంలో 3న గోదావరి, 5న క ృష్ణా జలాలపై సభలో చర్చ జరిగే అవకాశం ఉంది. తెలంగాణ నీటి వాటాల విషయంలో అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ పార్టీలు ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకుంటున్న క్రమంలో ఏర్పాటు చేసిన శాసనసభా సమావేశాలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. పాలమూరు-రంగారెడ్డి, పోలవరం-నల్లమలసాగర్ ప్రాజెక్టలపై క్యూసెక్కులు, టీఎంసీలు, అంకెలు, సంఖ్యలతో రెండు పార్టీలు అసెంబ్లీ వేదికగా నీళ్ల యుద్ధానికి సిద్ధమవుతున్నాయి. నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి నేడు ప్రజాభవన్‌లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు.

# మూడో వారంలో మున్సిపల్ ఎన్నికలు

మొదటి తరువాయి

ఆ తర్వాత ఎన్నికల షెడ్యూల్ జారీ చేయనుంది. పది రోజుల్లోనే ఎన్నికల ప్రక్రియను ముగించాలని ఎన్నికల సంఘం యోచిస్తున్నట్టు తెలిసింది. ఇదే అంశంపై మున్సిపల్ శాఖ అధికారులతో సమాలోచనలు చేసింది. దీంతో ఈ నెలాఖరులోపు కొత్త మేయర్లు, డిప్యూటీ మేయర్లు, చైర్మెన్లు, వైస్ చైర్మెన్లు, కౌన్సిలర్స్ కొలువుదీరనున్నారనే చర్చ జరుగుతోంది.

**గడువు ముగిసి ఏడాది**

రాష్ట్రంలో 26.01.2020న మున్సిపాల్టీల పాలకమండళ్లు కొలువుదీరాయి. వాటి కాలపరిమితి 26.01.2025తో ముగిసి దాదాపు ఏడాది కావొస్తున్నది. అయితే ఇప్పటి వరకు ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతున్నది. మొత్తం 130 మున్సిపాల్టీలకు గడువు ముగిసింది. 12 మున్సిపాల్టీలను కొత్తగా ఏర్పాటు చేసింది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పాలకమండలి కాలపరిమితి ఈ ఏడాది ఫిబ్రవరి 10న ముగియనుంది. ఇప్పుడు గ్రేటర్‌లో అదనంగా 27 మున్సిపాల్టీలను కలిపింది. వార్డుల విభజన కూడా జరిగింది. సరిహద్దులను ఖరారు చేసే పనిలో టౌన్ ప్లానింగ్ అధికారులు కసరత్తు చేస్తున్నారు. మొత్తం 300 డివిజన్ల హద్దులను ఖరారు చేయడం, ఓటర్ల




జాబితాను సిద్ధం చేసి ఏప్రిల్ మొదటివారంలో ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు. మున్సిపాల్టీలు, మున్సిపల్ కార్పొరేషన్లలో ఏడాది కాలంగా ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతుండటంతో కొత్త పనులకు అనుమతి లేకుండాపోయింది. అయితే కొనసాగుతున్న పనులకు నిధులు మంజూరు కాకపోవడంతో పెండింగ్ పనులు ముందుకు పోవడం లేదు. ఫలితంగా మున్సిపాల్టీల్లో ఎక్కడి సమస్యలు అక్కడే తిష్ట వేశాయి.

## మన బడి' బిల్లులు

# వెంటనే ఇవ్వండి

మొదటి తరువాయి



ప్రశ్నించారు. చేసిన పనులకు బిల్లులు అందక రాష్ట్రంలోని 'మన ఊరు-మన బడి' పనులు చేసిన కాంట్రాక్టర్లు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయారని ఆవేదన వ్యక్తంచేశారు. బుధవారం హైదరాబాద్‌లోని హరీశ్‌రావు నివాసానికి వెళ్లిన ఎంవోఎంబీ కాంట్రాక్టర్లు తమ గోడు వెల్లబోసుకున్నారు. అప్పులు చేసి ప్రభుత్వ పాఠశాలల్లో అభివ ృద్ధి పనులు చేశామని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి బిల్లులు చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. బిల్లులు రాక అప్పులు తెచ్చి వడ్డీలు చెల్లిస్తున్నామని, కుటుంబాలు నడవడం కష్టంగా ఉన్నదని చెప్పారు.

అసెంబ్లీలో సమస్యను లేవనెత్తుతా..

అసెంబ్లీ వేదికగా 'మన ఊరు-మనబడి' కాంట్రాక్టర్ల సమస్యలను లేవనెత్తుతానని కాంట్రాక్టర్లకు హరీశ్‌రావు భరోసా ఇచ్చారు. బిల్లులు చెల్లించే వరకు బీఆర్ఎస్ పోరాడుతుందని హామీ ఇచ్చారు. ప్రభుత్వ పాఠశాలలు బాగుపడాలని, తద్వారా అడ్మిషన్లు పెరిగి, పేద, మధ్య తరగతి పిల్లలకు నాణ్యమైన విద్య అందాలని కేసీఆర్ ఆలోచిస్తే.. రేవంత్‌రెడ్డి ఆ లక్ష్యాన్ని నీరుగారుస్తున్నారని మండిపడ్డారు. విద్యాశాఖ మంత్రిగా కూడా ఉన్న సీఎంకు రాష్ట్రంలో విద్యారంగంపై ఏమాత్రం శ్రద్ధ లేదని విమర్శించారు. గురుకుల విద్యార్థులకు సరిగా అన్నం కూడా పెట్టలేని చేతగాని సరారు ఇది అని మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ నిర్లక్ష్యానికి కాంట్రాక్టర్లు బలైపోతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు.

## గోదావరి నీటి మళ్లింపును

# అంగీకరించం

మొదటి తరువాయి

పునర్విభజన చట్టానికి వ్యతిరేకంగా ఏపీ తీసుకున్న నిర?యాన్ని అడ్డుకుంటామని స్పష్టం చేశారు. ఒక వైపు కేంద్రంపై ఒత్తిడి తెస్తూనే న్యాయ పోరాటం చేస్తామని పేర్కొన్నారు.

ఈ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాశయాల్లో 200 టీఎంసీల నీటిని మళ్లించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. నికర జలాలు కాకుండా అదనపు జలాలపై ఆధారపడి ప్రాజెక్ట్ చేపట్టడం సరికాదన్నారు. వరద రాని సీజన్‌లో నికర జలాలను మళ్లిస్తారనీ, ఫలితంగా తెలంగాణకు తీవ్ర అన్యాయం జరగుతుందని తెలిపారు. అదనపు వాటా తరలింపును ఎట్టి పరిస్థితుల్లోనూ ఆమోదించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఏపీ తీసుకుంటున్న ప్రణాళికలు వెలుగులోకి రాగానే తక్షణమే స్పందించి జనవరి 22న కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖకు, జూన్ 13, 16 తేదీల్లో జలశక్తితో పాటు పర్యావరణ, అటవీ శాఖలకు లేఖలు రాశామని గుర్తు చేశారు. అంతర్‌రాష్ట్ర వివాదాలు పరిష్కారం కాలేదనీ, గోదావరి నది యాజమాన్య బోర్డు నిబంధనలకు విరుద్ధమనీ, వరద నీటి లభ్యతపై సీడబ్ల్యూసీ అనుమతి అవసరమని పేర్కొన్నారు. అయినా ఆంధ్రప్రదేశ్ గతేడాది నవంబర్ 21న డీపీఆర్ టెండర్లను పిలవడంతో, తెలంగాణ ప్రభుత్వం డిసెంబర్ 16, 2025న సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ నెం.1258/2025 దాఖలు చేసిందని తెలిపారు. గోదావరిలో తెలంగాణకు కేటాయించిన 968 టీఎంసీల నీటి హక్కులను కాపాడుకోవడమే మా ముందున్న కర్తవ్యమని పేర్కొన్నారు. తాము నిర్లక్ష్యం చేస్తున్నామని ప్రతిపక్షాలు చెప్పడం అసత్యమని తెలిపారు. తెలంగాణా నీటి వాటాల పరిరక్షణకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తేల్చి చెప్పారు.

# దిగొచ్చిన ఫుడ్ యాప్‌లు

మొదటి తరువాయి




తీసుకోకపోవడం వంటి వాటిపై జరిమానాలు కూడా విధించబోమని హామీ ఇచ్చింది. జొమాటో తరహాలోనే స్విగ్గీ కూడా తన డెలివరీ బార్సుకు ఆఫర్స్‌ను ప్రకటించింది. పీక్ అవర్స్‌లో రూ.2వేల వరకు సంపాదించుకోవచ్చని పేర్కొంది. క్విక్ కామర్స్ వేదిక జెప్టో కూడా ప్రోత్సా హకాలు ప్రకటించింది. దేశ వ్యాప్తంగా డిసెంబర్ 25న గిగ్‌వర్కర్లు సమ్మె చేపట్టి ఫుడ్ యాప్‌లకు ఝలక్ ఇచ్చిన విషయం తెలిసిందే. దీంతో డెలివరీ యాప్స్‌పై తీవ్ర ప్రభావం పడ్డాయి. కొత్త సంవత్సరం ముందు రోజు భారీగా ఆర్డర్లు ఉండ టంతో మళ్లీ ప్రభావం పడొచ్చనే భయంతో ఆయా యాజమాన్యాలు గిగ్‌వర్కర్లకు ప్రోత్సాహకాలు పెంచి తాత్కాలికంగా బయటపడ్డాయని తెలుస్తో

# మూడో పక్షం జోక్యం లేదు..

**-ఇండోపాక్ మధ్య శాంతి నెలకొల్పేందుకు తాము మధ్యవర్తిత్వం వహించినట్లు ప్రకటించిన చైనా**

**-ఇండోపాక్ ఉద్రిక్తతలపై చైనా ప్రకటనను తిరస్కరించిన భారత్**



**న్యూఢీల్లీ**

ఇండియా, పాకిస్థాన్ మధ్య ఆపరేషన్ సిందూర్ సమయంలో ఉద్రిక్తతలు నెలకొన్న విషయం తెలిసిందే. అయితే ఇండోపాక్ మధ్య శాంతి నెలకొల్పేందుకు తాము మధ్యవర్తిత్వం వహించినట్లు చైనా ప్రకటించింది. చైనా వ్యాఖ్యలను భారత్ తీవ్రంగా ఖండించింది. పాక్‌తో కాల్పుల విరమణలో మూడో పక్షం జోక్యం లేదని స్పష్టం చేసింది. ఆపరేషన్ సిందూర్ తర్వాత మే 10న జరిగిన కాల్పుల విరమణ.. రెండు దేశాల డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ మధ్య ప్రత్యక్ష చర్చల ద్వారా కుదిరిందని వెల్లడించింది. 'మేము ఇప్పటికే అలాంటి వాదనలను తోసిపుచ్చాము. భారత్-పాక్ మధ్య సమస్యల పరిష్కారానికి మూడో పక్షం ప్రమేయం లేదు. రెండు దేశాల డీజీఎమ్‌వోలు నేరుగా సంప్రదింపులు జరిపి కాల్పుల విమరణ ఒప్పందాన్ని అంగీకరించారు. ఈ విషయంపై గతంలో అనేక సందర్భాల్లో మా వైఖరిని స్పష్టం చేశాము' అని ప్రభుత్వం స్పష్టం చేసింది.

# రష్యా అధ్యక్షుడు పుతిన్ నివాసంపై దాడి

మొదటి తరువాయి

నివేదికలు తీవ్ర ఆందోళన కలిగించాయని ప్రపంచదేశాల నేతలు పేర్కొన్నారు. ఘర్షణలకు ముగింపు, శాంతి సాధనకు ప్రస్తుతం కొనసాగుతున్న దౌత్య ప్రయత్నం అత్యంత ఆచరణీయ మార్గమని సూచించారు.

## ఎమ్మెల్యే దృష్టికి సమ్మక్క సారలమ్మ జాతర వివాదం



**పాలకుర్తి, డిసెంబర్ 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పాలకుర్తి మండలం ఈశాల తక్కల్లపల్లి గ్రామంలో రెండేళ్లకోసారి జరిగే శ్రీ సమ్మక్క సారలమ్మ జాతర నిర్వహణపై వివాదం ముదిరింది. మూడు గ్రామాల సర్పంచులు జాతర నిర్వహణ తమదేనని పట్టుబడుతుండగా, మరోవైపు స్థానిక దళితులు కూడా తమకే హక్కు ఉందని చేయడంతో సమస్య తీవ్రరూపం దాల్చింది. ఈ నేపథ్యంలో సర్పంచులు హైదరాబాద్‌లో అసెంబ్లీ సమావేశాల్లో ఉన్న రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కన్ సింగ్‌ను కలిసి జాతర నిర్వహణపై చర్చించారు. ఇప్పటికే ఎమ్మెల్యే 20 లక్షల రూపాయలు మంజూరు చేయగా, అధికారులు పనులు ప్రారంభించారు. వాస్తవానికి ఎండోమెంట్ శాఖ ఆధ్వర్యంలో జరగాల్సిన ఈ జాతర ప్రతిసారి వివాదాలతోనే సాగుతుండటంతో భక్తులు ఆసక్తి తగ్గిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆదాయం కోసం మాత్రమే పోటీ పడుతూ, తర్వాత దేవస్థానాన్ని పట్టించుకునే వారు లేరని ప్రజలు విమర్శిస్తున్నారు. రెండు రోజుల్లో జాతర నిర్వహణపై తుది నిర్ణయం తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు.

## అక్రమ నిర్మాణ కేసులో జైలుకు నిందితుడు

**కరీంనగర్ రూరల్, డిసెంబర్ 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
బొమ్మకల్ డివిజన్‌లో వేరొకరి స్థలంలో అక్రమంగా ఇల్లు నిర్మించిన నాకర్ని నాన్జీ భాయ్ పటేల్‌ను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించారు. తగదాలో ఉన్న స్థలంపై నకిలీ డాక్యుమెంట్లు తయారు చేసి ఇల్లు నిర్మించాడని డివిజనల్ పంచాయతీ అధికారి రాంబాబు ఫిర్యాదు మేరకు కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. విచారణ అనంతరం నిందితుడిని రెండవ అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా జైలుకు తరలించారు. ఈ విషయాన్ని రూరల్ సీఐ నిరంజన్ రెడ్డి వెల్లడించారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో మందుల కొరత




**గోదావరిఖని, డిసెంబర్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రామగుండం నియోజకవర్గంలోని గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రిలో మందుల కొరతతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అప్పుడే పుట్టిన శిశువులకు కూడా మందులు అందక, బయట ప్రైవేట్ మెడికల్ షాపులను ఆశ్రయించాల్సి వస్తోందని రోగులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆసుపత్రి లోపలే ఉన్న మెడికల్ షాపులో డాక్టర్లు వ్రాసిన మందులు లేవని, బయట ప్రైవేట్ షాపుల్లో కొనాలని సిబ్బంది సూచిస్తున్నారని రోగులు వాపోతున్నారు. పారిశ్రామిక ప్రాంతం కావడంతో షుగర్, క్యాన్సర్, లివర్, గుండె జబ్బులు వంటి వ్యాధులతో బాధపడుతున్న ప్రజలు మరింత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఓపీ ఫీస్ మాత్రమే ఉచితంగా ఉండగా, టెస్టులు, మందుల కోసం ప్రైవేట్ ల్యాబ్‌లు, షాపులను ఆశ్రయించాల్సి వస్తోందని ప్రజలు తెలిపారు. ఆసుపత్రి కాంపౌండ్‌లోనే ఉన్న జీవనధార అనే ప్రైవేట్ మెడికల్ షాప్‌లో ఉచితంగా లభించాల్సిన మందులను అధిక ధరలకు విక్రయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని నాయకులు, అధికారులు వెంటనే స్పందించి అన్ని రకాల రోగులకు మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## కిండర్ కబ్స్ ప్రీస్కూల్ లో ముందస్తు న్యూ ఇయర్ సెలబ్రేషన్స్




**నిజాంపేట , డిసెంబర్ 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రంగారెడ్డి జిల్లా నిజాంపేట్ లో ఉన్న కిండర్ కబ్స్ ప్రీస్కూల్ లో ముందస్తుగా 2026 నూతన వేడుకలు ఘనంగా నిర్వహించినారు. ఈ కార్యక్రమంలో కిండర్ కబ్స్ ప్రీ స్కూల్ డైరెక్టర్లు ప్రసాద్,అభిషేక్,శ్రావ్య,సింధు తదితరులు పాల్గొన్నారు

## రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలపై బీఎస్పీ ఆందోళన



**హుస్నాబాద్, డిసెంబర్ 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: రిటైర్మెంట్ ఉద్యోగులు, ఉపాధ్యాయుల బెనిఫిట్స్ ఇవ్వకపోవడంతో వారి జీవితాలతో ప్రభుత్వం చెలగాటం చేస్తోందని బీఎస్పీ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ పచ్చిమట్ల రవీందర్ గౌడ్ తీవ్రంగా విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 20 నెలలు గడిచినా రిటైర్డ్ ఉద్యోగులకు గ్రాట్యుటీ, కమ్యూనిటీ పెన్షన్, పీఎఫ్, లీవ్ ఇన్‌కాష్మెంట్ వంటి బకాయిలు చెల్లించకపోవడంతో రాష్ట్రంలో 36 మంది మరణించారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రిటైర్డ్ ఉద్యోగులు పిల్లల పెళ్లిళ్లు, గృహనిర్మాణం వంటి అవసరాల కోసం ఈ డబ్బుపై ఆధారపడుతున్నారని, కానీ ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తోందని ఆరోపించారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం పీఎఫ్ వాడుకుని ఇబ్బంది పెట్టిందని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే బకాయిలు చెల్లిస్తామని హామీ ఇచ్చి గెలిచిందని, కానీ ఇప్పటివరకు ఏ హామీని నెరవేర్చలేదని విమర్శించారు. డిఏలు, పిఆర్సి, హెల్త్ కార్డులు, సెపీఎస్ రద్దు వంటి అంశాల్లో కూడా ప్రభుత్వం విఫలమైందని అన్నారు. ప్రభుత్వానికి నిజమైన చిత్తశుద్ధి ఉంటే అసెంబ్లీలో చర్చ జరిపి సమస్యలు పరిష్కరించాలని బీఎస్పీ పార్టీ డిమాండ్ చేస్తోందని రవీందర్ గౌడ్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎలగందుల శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

## వార్డుల విభజనను సరిచేయాలి



**హుస్నాబాద్, డిసెంబర్ 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
హుస్నాబాద్ మున్సిపల్‌లో వార్డుల విభజన సరిగా లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఓటర్ల సంఖ్య పెరుగుదలకు అనుగుణంగా కొత్త వార్డులు ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ రోజు బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ గౌడ్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లికార్జున్ రెడ్డి మాట్లాడుతూ, ఒకే కాలనీలో రెండు మూడు వార్డులు ఉండడం వలన అభివృద్ధి పనులు అడ్డంకులు ఎదుర్కొంటున్నాయని, ఒక కాలనీకి ఒకే వార్డు ఉండేలా చూడాలని కోరారు. పట్టణంలో కొత్త ఓటర్లు నమోదు కావడంతో ఓట్ల సంఖ్య పెరిగిందని, కాలనీలు కూడా విస్తరించాయని, అందువల్ల రెండు మూడు కొత్త వార్డులు పెంచాలని సూచించారు. ఇంకా కొంతమంది ఓటర్లు జాబితాలో నమోదు కాకపోవడంతో వారిని గుర్తించి నమోదు చేయాలని, ఓటర్ల జాబితాలో తప్పులు లేకుండా చూసి ప్రజలకు ఇబ్బందులు రాకుండా చూడాలని మున్సిపల్ అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ కౌన్సిలర్ బొజ్జ హరీష్, సీనియర్ నాయకులు మల్కి రెడ్డి, మోహన్ రెడ్డి, యాస శ్రీనివాస్, యువజన విభాగం అధ్యక్షుడు మేకల వికాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## విజయవంతంగా గొర్రెల నట్టల నివారణ కార్యక్రమం



**కరీంనగర్ రూరల్, డిసెంబర్ 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
గొర్రెల్లో తరచుగా వచ్చే నట్టల సమస్యలను నివారించేందుకు మొగ్దుంపూర్ గ్రామంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. గొర్రెల కాపారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు బండి మల్లన్న యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారుల సమక్షంలో గొర్రెలకు చికిత్సలు అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సీనమ్మ, ఉపసర్పంచ్ కూకట్ల రమేష్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వార్డ్ మెంబర్ కూకట్ల సంజీవ్, సొసైటీ ఉపాధ్యక్షుడు కాల్వ శ్రీనివాస్ యాదవ్, కార్యదర్శి కూకట్ల కొమురయ్యతో పాటు పెద్ద సంఖ్యలో గొర్రెల పెంపకదారులు హాజరయ్యారు. గ్రామస్థులు ఈ కార్యక్రమాన్ని అభినందిస్తూ, ఇలాంటి చర్యలు తరచుగా చేపడితే పశు సంవర్ధక రంగానికి మరింత మేలు జరుగుతుందని అభిప్రాయపడ్డారు.

## అమృత్ స్కీంలో కాలువ పనులు ప్రారంభం



**అమరాబాద్, డిసెంబర్ 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
అచ్చంపేట పట్టణంలో అమృత్-2.0 స్కీం కింద వలపట్ల శనగకుంట డైవర్షన్ కాలువ పనులకు శంకుస్థాపన జరిగింది. రూ.1 కోటి 78 లక్షల బడ్జెట్‌తో చేపట్టిన ఈ పనులు పట్టణ అభివృద్ధికి దోహదం చేయనున్నాయి. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు, తమిళనాడు రాష్ట్ర ఎఐసిసి పరిశీలకులు, జిల్లా డిసిసి అధ్యక్షులు, అచ్చంపేట శాసనసభ్యులు డా. చిక్కుడు వంశీకృష్ణ సహకరించారు. భూమి పూజలో మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు, కమిషనర్ ఏఈ షబ్బీర్ రాజు నాయక్, మున్సిపాలిటీ కమిషనర్ మురళి, కౌన్సిలర్లు ఆకుల వెంకటేష్, శివతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## గిన్నిస్ రికార్డు నమోదుచేసిన సహస్ర



**అమ్రాబాద్, డిసెంబర్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నాగర్‌కర్నూలు జిల్లా అచ్చంపేట మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు కుమార్తె సహస్ర కూచిపూడి నృత్యంలో గిన్నిస్ రికార్డు సాధించింది. హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన ఈ ఘన కార్యక్రమంలో సహస్ర తన కుటుంబంతో కలిసి పాల్గొంది. ఈ సందర్భంగా చైర్మన్ దంపతులు, మంత్రివర్యులు వాకిటి శ్రీహరి, కార్పొరేషన్ చైర్మన్ శివసేన రెడ్డి, కల్వ సుజాత గుప్త తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అచ్చంపేటకు ఈ గిన్నిస్ రికార్డు గౌరవం లభించడం స్థానిక ప్రజల్లో ఆనందాన్ని కలిగించింది.

## గుంతల పడ్డ రోడ్డును మరమ్మతులు చేయాలని బీజేపీ డిమాండ్



**హుస్నాబాద్, డిసెంబర్ 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
హుస్నాబాద్ పట్టణంలోని సబ్‌స్టేషన్ వద్ద బీజేపీ నాయకులు రహదారి గుంతలపై నిరసన తెలిపారు. పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్ బాబు మాట్లాడుతూ, హుస్నాబాద్‌కరీంనగర్ ప్రధాన రహదారిపై భారీ వర్షాల కారణంగా మూడు నెలలుగా గుంతలు ఏర్పడి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రి వేళల్లో వాహనాలు గుంతల్లో పడిపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని, ఆర్ అండ్ బి అధికారుల నిర్లక్ష్యం వల్ల వాహనదారులు మెకానిక్ షెడ్లకు వెళ్లే పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. హుస్నాబాద్ శాసనసభ్యుడు, మంత్రి పొన్నం ప్రభాకర్ తరచూ ఈ మార్గంలో ప్రయాణిస్తున్నప్పటికీ సమస్యను పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వం నాలుగు వరుసల రహదారి మంజూరైందని చెప్పినా పనుల్లో పురోగతి లేదని ఆరోపించారు. వెంటనే రహదారి మరమ్మతులు చేయాలని, లేనిపక్షంలో ప్రజలతో కలిసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కిసాన్ సంఘ్ ఇన్చార్జి కవ్వ వేణు గోపాల్ రెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శులు గాదాసు రాంప్రసాద్, పోలోజు రాజేందర్ చారీ, సీనియర్ నాయకులు వరియోగుల అనంతస్వామి పాల్గొన్నారు.

# బీజేపీలో భారీగా చేరికలు



**హుస్నాబాద్, డిసెంబర్ 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
అక్కన్నపేట మండలంలో ఉప సర్పంచులు, వార్డ్ మెంబర్లు బీజేపీలో చేరారు. కెప్టెన్ చౌడుతాండ ఉప సర్పంచ్ గూగులోతు అర్జున్ నాయక్, వార్డ్ మెంబర్ నూనావత్ దత్తాత్రేయ నాయక్‌తో పాటు స్థానిక నాయకులు ధారావతు లింగ్య నాయక్ బీజేపీలో చేరారు.ఈ చేరికలు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ సమక్షంలో, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, మండల అధ్యక్షుడు రామంచ మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగాయి. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నూనావత్ మోహన్ నాయక్, లావుడ్య రైనా నాయక్, భూక్యా సుధాకర్, మైసమ్మ వాగు తండా మాజీ సర్పంచ్ సందబోయిన కుమార్, బూత్ అధ్యక్షులు భూక్యా ప్రవీణ్ కుమార్, బానోతు సుమన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.ఈ చేరికలతో అక్కన్నపేట మండలంలో బీజేపీ శక్తి మరింతగా పెరిగిందని పార్టీ నాయకులు పేర్కొన్నారు.

# జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు



**కరీంనగర్, డిసెంబర్ 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జిల్లా ప్రజలందరూ నూతన సంవత్సరంలో ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని కోరుతూ సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ శుభాకాంక్షలు తెలిపారు.గడిచిన సంవత్సరంలో కొంతమంది ప్రజలకు చేదు అనుభవాలు ఎదురైనా, మరికొందరికి మంచి జరిగిందని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న పేద ప్రజల సమస్యలను ఈ కొత్త సంవత్సరంలో పాలకులు పరిష్కరించాలని, సమాజంలోని అన్ని వర్గాలు బాగుంటేనే ప్రభుత్వాలు బాగుంటాయని అన్నారు.దేశానికి అన్నం పెట్టే రైతన్న సంక్షేమం కోసం పాలకులు కృషి చేయాలని, కార్మికులుకర్షకుల పక్షాన సిపిఐ ఎల్లప్పుడూ పోరాడుతుందని తెలిపారు. కమ్యూనిస్టు పార్టీ వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నూతన సంవత్సరంలో పార్టీ మరింత బలోపేతం కావాలని, శ్రేణులు అహర్నిశలు కృషి చేస్తారని పంజాల శ్రీనివాస్ పేర్కొన్నారు. జిల్లా ప్రజలతో పాటు సిపిఐ శ్రేణులకు ఆయన నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

# ఘనంగా నూతన సంవత్సర వేడుకలు





**హుస్నాబాద్, డిసెంబర్ 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
హుస్నాబాద్ పట్టణంలోని నవభారత్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్‌లో బుధవారం ముందస్తు నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. పాత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ, కొత్త సంవత్సరానికి స్వాగతం చెబుతూ విద్యార్థులు చేసిన నృత్యాలు, ఆటపాటలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ గంగరవేణి రవి మాట్లాడుతూ, కొత్త సంవత్సరంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నూతన సంవత్సర కేక్ కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో కరీంనగర్




**కరీంనగర్, డిసెంబర్ 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
సెర్ప్ హైదరాబాద్ ముఖ్య కార్యనిర్వహణాధికారి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాల అధికారులకు దివ్యాంగుల సంక్షేమంపై కీలక ఆదేశాలు జారీ చేశారు.ఆన్లైన్‌లో నమోదు చేసుకున్న ప్రతి దివ్యాంగుడికి స్లాట్లు కేటాయించి, పబ్లిసిటీ ద్వారా అవగాహన కల్పించాలని సూచించారు. నిర్ణీత కాలంలో ప్రత్యేక క్యాంపులు నిర్వహించి, వారికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. అలాగే, సమయానికి డేటా ఎంట్రీ పూర్తి చేసి అర్హులైన వారికి యు.డి.ఐ.డి కార్డులు జారీ చేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్లు, డి.ఆర్.డి.ఓ., మెడికల్ సూపరింటెండెంట్, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు. రాష్ట్ర స్థాయిలో కరీంనగర్ జిల్లా ప్రథమ స్థానంలో నిలిచినందుకు అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి, మెడికల్ సూపరింటెండెంట్‌లకు ముఖ్య కార్యనిర్వహణాధికారి అభినందనలు తెలిపారు.రానున్న కాలంలో ఇదే స్ఫూర్తితో పనిచేయాలని ఆయన సూచించారు.

# గిన్నిస్ బుక్‌లో చోటు దక్కించుకున్న రెయిన్బో స్కూల్ విద్యార్థిని నందన నేహ



**గోదావరిఖని, డిసెంబర్ 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
గోదావరిఖని రెయిన్బో స్కూల్ విద్యార్థిని చేరాల నందన నేహ తన ప్రతిభతో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌లో స్థానం సంపాదించింది. హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన భారతనాట్యం పోటీల్లో ఆమె పాల్గొని తన నైపుణ్యాన్ని చాటింది.నాట్య ఆచార్య దగ్గుల జ్యోతిర్మయి పర్యవేక్షణలో నందన నేహ ప్రదర్శన ఇచ్చి గోదావరిఖని ఖ్యాతిని పెంచడంతో పాటు పారిశ్రామిక ప్రాంతానికి గర్వకారణంగా నిలిచింది. ఈ సందర్భంగా రెయిన్బో స్కూల్ కరస్పాండెంట్ పి.ఎస్. అమరేందర్ విద్యార్థిని నందన నేహను అభినందించారు. నందనకు శిక్షణ ఇచ్చిన నాట్య ఆచార్య దగ్గుల జ్యోతిర్మయి కూడా అమరేందర్ గారి శిష్యురాలే కావడం విశేషమని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొని నందన నేహకు అభినందనలు తెలిపారు. ఈ విజయంతో నందన నేహ స్థానికంగా మాత్రమే కాకుండా జాతీయ స్థాయిలో కూడా ప్రతిభను చాటిన ఘనత సాధించింది.

# ఘనంగా పోలీసు అధికారుల పదవీ విరమణ సన్మానం



**కరీంనగర్, డిసెంబర్ 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో సుదీర్ఘకాలం విశేష సేవలందించిన ఇద్దరు పోలీసు అధికారుల పదవీ విరమణ సన్మాన కార్యక్రమం బుధవారం కమిషనరేట్ కార్యాలయంలో ఘనంగా జరిగింది. కంట్రోల్ రూమ్ ఎస్సై శ్రీనివాస్, ఏఆర్ హెడ్‌క్వార్టర్స్ ఎస్సై రాంచందర్ పదవీ విరమణ పొందారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, పదవీ విరమణ పొందిన అధికారులను పూలమాలలు వేసి, శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సవాళ్లతో కూడిన పోలీస్ ఉద్యోగాన్ని నిబద్ధతతో పూర్తి చేయడం గొప్ప విజయమని అభినందించారు. అధికారులు అందించిన సేవలకు కుటుంబ సభ్యుల సహకారం కీలకమని గుర్తుచేశారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీలు వెంకటరమణ, భీంరావు, రిజర్వు ఇన్స్పెక్టర్ మేడ కిరణ్ కుమార్, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు మామిడి సురేందర్, ఇతర అధికారులు, సిబ్బంది, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపు కోరిన జి.టి.ఏ



**కరీంనగర్, డిసెంబర్ 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కరీంనగర్ జిల్లా ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘం (జి.టి.ఏ) ప్రతినిధులు ఈరోజు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌ను కలుసుకుని ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని వినతి సమర్పించారు.సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ, ఇప్పటికే బీఈడీ వంటి ఉపాధ్యాయ వృత్తి విద్యా కోర్సులు పూర్తి చేసి, కఠినమైన పోటీ పరీక్షలను ఎదుర్కొని ఉద్యోగంలో ఉన్న ఉపాధ్యాయులకు మళ్లీ టెట్ తప్పనిసరి చేయడం అనవసరమని, ఇది వేలాది మంది ఉపాధ్యాయులకు మనోవేదన కలిగిస్తుందని తెలిపారు. ఈ నిబంధనలను పున సమీక్షించి ఉపాధ్యాయుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని కేంద్ర విద్యాశాఖ తగిన నిర్ణయం తీసుకోవాలని కోరారు.ఈ సందర్భంగా జి.టి.ఏ టేబుల్ క్యాలెండర్‌ను మంత్రి బండి సంజయ్ ఆవిష్కరించారు.కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు గాజుల రవీందర్, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, గౌరవ అధ్యక్షులు భగవంతయ్య, కార్యవర్గ సభ్యులు బొడిగే శ్రీనివాస్, ప్రమీల, శంకర్, ఆకారపు మమత, వెంకటయ్య, మాగంటి శ్రీనివాస్, యం.ఇ.ఓ. పుప్పాల కృష్ణ గోపాల్, ఉపాధ్యాయులు సంగోజు సత్యనారాయణ చారి, ప్రసాద్ రావు, రామారావు, ప్రవీణ్ రావు, తిరుపతి రెడ్డి, పి.రమేష్ రెడ్డి, లక్ష్మీపతి, మైసయ్య తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమకారులతో భూ పోరాటంలో పాల్గొన్న కల్వకుంట్ల కవిత



**కరీంనగర్, డిసెంబర్ 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కరీంనగర్‌లో ఉద్యమకారులతో కలిసి భూ పోరాటంలో పాల్గొన్నారు. ఉద్యమకారులకు ప్రభుత్వం హామీ ఇచ్చిన 250 గజాల స్థలాన్ని వెంటనే కేటాయించాలని ఆమె డిమాండ్ చేశారు.కవిత మాట్లాడుతూ, మనం కొట్లాడితేనే తెలంగాణ వచ్చింది. ఉద్యమకారుల చెమటతోనే రాష్ట్రం సాధ్యమైంది. కానీ ఇప్పటికీ వారికి గౌరవం, హక్కులు దక్కలేదు. మళ్లీ కమిటీలు అంటూ కాలయాపన చేస్తే ఊరుకోం అని హెచ్చరించారు. ఉద్యమకారుల ఫోరం ఇచ్చిన డేటా ప్రకారమే గుర్తింపు ఇవ్వాలని, ఊరి ప్రజలు చెప్పిన పేర్లను జాబితాలోకి తీసుకోవాలని ఆమె సూచించారు. కాంగ్రెస్ పార్టీ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు పెన్షన్, సంక్షేమ బోర్డు, 250 గజాల స్థలం నెరవేర్చే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ప్రభుత్వం దిగివచ్చే వరకు కదిలేది లేదు. శాంతియుతంగా పోరాటం చేస్తాం. అవసరమైతే ఎక్కడికక్కడ భూములను ఆక్రమించుకోవాలని ఉద్యమకారులకు పిలుపునిస్తున్నా అని కవిత పేర్కొన్నారు. కార్యక్రమంలో జాగృతి రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు లకవత్ రూప్ సింగ్, జిల్లా అధ్యక్షులు గుంజపడుగు హరిప్రసాద్, ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షులు కనకం కుమారస్వామి, ప్రధాన కార్యదర్శి మ్యాకల తిరుపతి, అక్కం శివరాణి, యండి సల్మ, జంగ అపర్ణ, రంగరవేణి లక్ష్మణ్, కుతాడి శ్రీనివాస్, కొత్తురి రఘు, శ్రీరాముల రమేష్, బుడిగే పర్శరం గౌడ్, చంటి శ్రీనివాస్, హుస్నాబాద్ రాజ్‌కుమార్, హుసేన్, యాకుబ్ తదితరులు పాల్గొన్నారు.ఈ పోరాటం ద్వారా ఉద్యమకారుల సమస్యలు మరోసారి రాష్ట్ర రాజకీయాల్లో ప్రధాన చర్చగా మారాయి.

# ఘనంగా బంగారు పతకం విజేత బండి రాధా సన్మానం



**కరీంనగర్, డిసెంబర్ 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఇటీవల కరీంనగర్‌లో జరిగిన 12వ రాష్ట్రస్థాయి మాస్టర్ అథ్లెటిక్ పోటీల్లో 5 కిలోమీటర్లు, 900 మీటర్లు, 2 కిలోమీటర్ల రన్నింగ్ మరియు వాకింగ్ విభాగాల్లో బంగారు పతకాలు సాధించిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ స్టేడియం మహిళా వాకర్ అసోసియేషన్ సలహాదారు బండి రాధాను ఈరోజు ఉదయం స్టేడియంలో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా అంబేద్కర్ స్టేడియం వాకర్స్ పాల్గొని ఆమె విజయాన్ని అభినందించారు. రాధా సాధించిన ఈ విజయంతో కరీంనగర్ క్రీడా రంగానికి గర్వకారణంగా నిలిచింది.

# నూతన సంవత్సరం కొత్త ఆశలకు ఆరంభం

ప్రపంచవ్యాప్తంగా జనవరి 1వ తేదీని నూతన సంవత్సరంగా ఘనంగా జరుపుకుంటారు. పాత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ, కొత్త ఆశలు, కొత్త లక్ష్యాలు, కొత్త ఆలోచనలతో ముందడుగు వేయడానికి ఈ రోజు ప్రేరణనిస్తుంది. నూతన సంవత్సరం కేవలం క్యాలెండర్ మార్పు మాత్రమే కాదు; అది మన ఆలోచనల్లో, ఆచరణలో మార్పు తీసుకురావాల్సిన సమయం. గత సంవత్సరంలోని విజయాల నుంచి ప్రేరణ తీసుకుని, తప్పుల నుంచి పాఠాలు నేర్చుకోవడం ద్వారా కొత్త ఆరంభానికి అవకాశం కల్పిస్తుంది. ఈ రోజు ప్రజలు తమ ఇళ్లు శుభ్రపరచి, దేవాలయాలు, చర్చిలు, మసీదులకు వెళ్లి ప్రార్థనలు చేస్తారు. పెద్దల ఆశీర్వాదం తీసుకుంటూ, మిత్రులు, బంధువులకు శుభాకాంక్షలు తెలియజేస్తారు. ఈ సంప్రదాయాలు మన సంస్కృతిలో ఐక్యత, సౌహార్దం విలువలను ప్రతిబింబిస్తాయి. నూతన సంవత్సరంలో సంకల్పాలు చేయడం ఒక ముఖ్యమైన ఆచారం. మంచి అలవాట్లు అలవరుచుకోవడం, ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టడం, సమయాన్ని సద్వినియోగం చేయడం వంటి సంకల్పాలు వ్యక్తిగత అభివృద్ధికి




దోహదపడతాయి. నిజాయితీగా అమలులో పెట్టినప్పుడే నూతన సంవత్సరానికి నిజమైన అర్థం ఉంటుంది. సామాజికంగా చూస్తే, నూతన సంవత్సరం శాంతి, సహనం, మానవత్వం వంటి విలువలను గుర్తు చేస్తుంది. వ్యక్తిగత ఆనందంతో పాటు సమాజ శ్రేయస్సు కోసం ఆలోచించాల్సిన బాధ్యతను ఈ రోజు మనకు గుర్తు చేస్తుంది. ముగింపుగా, జనవరి 1 మనందరికీ ఆశావహమైన భవిష్యత్తును నిర్మించుకునే అవకాశం. మంచి ఆలోచనలు, మంచి కార్యాలతో ముందుకు సాగితే, ప్రతి రోజు నూతన సంవత్సరంలా మారుతుంది.

వేల్పుల మహేందర్, అధ్యాపకులు
కింగ్‌స్టన్ కాలేజీ ఆఫ్ ఎడ్యుకేషన్



# మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కాషాయ జెండా ఎగరేస్తాం

**- బండి సంజయ్**

**కరీంనగర్, డిసెంబర్ 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కరీంనగర్ కార్పొరేషన్‌తో పాటు తన పార్లమెంట్ పరిధిలోని మున్సిపాలిటీల్లో బీజేపీ విజయాన్ని సాధించి కాషాయ జెండా ఎగరేయడమే లక్ష్యమని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. త్రిధా హోటల్‌లో జరిగిన ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈసారి కరీంనగర్ మేయర్ పీఠాన్ని బీజేపీ కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. టిక్కెట్ల విషయంలో పైరవీలు, ఒత్తిడులకు తావులేదని, సర్వే ఆధారంగా గెలుపు అవకాశమున్న అభ్యర్థులకే టిక్కెట్లు ఇస్తామని స్పష్టం చేశారు. టిక్కెట్లు రాకపోయినా పార్టీ,



నామినేటెడ్ పదవుల్లో వారికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఎన్నికల సమయంలో గొడవలకు దిగే నేతలను ఉపేక్షించబోమని, వెంటనే షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించారు. బెంగాల్, తమిళనాడు ఎన్నికల తరువాత బీజేపీ జాతీయ నాయకత్వం దృష్టి మొత్తం తెలంగాణపై కేంద్రీకృతం కానుందని ఆయన తెలిపారు. ఈసారి తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం తథ్యమని, తెలంగాణలో బీజేపీ గెలుపుతో కాంగ్రెస్ ముక్త్ భారత్ లక్ష్యం సంపూర్ణం అవుతుందని అన్నారు. బీజేపీ కార్యకర్తల త్యాగాలు, పోరాటాలతో కేరళ మున్సిపల్ ఎన్నికల్లో విజయ ఢంకా మోగించిందని గుర్తుచేశారు. బెంగాల్‌లో కార్యకర్తల ఇళ్లను ధ్వంసం చేసినా, మహిళా మోర్చా కార్యకర్తలపై దాడులు జరిగినా వెనకంజ వేయకుండా పోరాటం కొనసాగిస్తున్నారని చెప్పారు. త్వరలోనే హైకమాండ్ దృష్టి తెలంగాణపై పూర్తిగా కేంద్రీకృతం అవుతుందని, బీజేపీ అధికారంలోకి రావడాన్ని ఎవరూ ఆపలేరని బండి సంజయ్ స్పష్టం చేశారు.

# ఈచ్ వన్ టీచ్ వన్ పై అవగాహన సదస్సు

**పెద్దపల్లి, డిసెంబర్ 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని పెద్దపల్లి జిల్లాలోని ట్రినిటీ డిగ్రీ మరియు పీజీ కళాశాల ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ కార్యక్రమంలో భాగంగా



ఈచ్ వన్ టీచ్ వన్ అనే సామాజిక అవగాహన కార్యక్రమం చందపల్లి గ్రామంలో ఘనంగా నిర్వహించారు. గ్రామీణ ప్రజలకు కనీస విద్యా అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యంగా చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ట్రినిటీ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ డైరెక్టర్ డా. దాసరి మమతా రెడ్డి మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ తాము నేర్చుకున్న విద్యను మరొకరికి బోధిస్తే సమాజంలో అక్షరాస్యత స్థాయి పెరుగుతుంది. విద్య వ్యక్తిగత అభివృద్ధికి మాత్రమే కాకుండా సమాజ పురోగతికి కూడా బలమైన పునాది అని అన్నారు. విద్యార్థులు ఎన్ఎస్ఎస్ కార్యక్రమాల ద్వారా సేవాభావాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నాటకం ప్రేక్షకులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఎం. నీతా రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ ఎం. రాంచందర్, అధ్యాపకులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. నిర్వాహకులు ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో సేవాభావం, సమాజంపై బాధ్యత మరింత పెరిగిందని తెలిపారు.

# కాంగ్రెస్ పార్టీ నుండి బిఆర్ఎస్ పార్టీలో చేరిన బాలాజీ నగర్ తండ యువకులు



**కడ్తాల్, డిసెంబర్ 31 ( నీలగిరి ఎక్స్ ప్రెస్)** కడ్తాల్ మండలం బాలాజీ నగర్ గ్రామపంచాయతీ యువకులు కాంగ్రెస్ పార్టీని వీడి బి ఆర్ ఎస్ పార్టీలో చేరారు పార్టీలో చేరిన వారికి కండువా కప్పి పార్టీలోకి స్వాగతం పలికారు. పార్టీలో చేరిన వారిలో పూరియా, రమేష్, దశరథ్, శ్రీను,హరి, రాజు,పాండు, గోపాల్,లచ్చిరాం, గణేష్, సేవ్య, వాసుదేవ హరి లక్ష్మణ్ మాజీ జడ్పిటిసి దశరథ్ నాయక్ బుధవారం కడ్తాల్ మండలంలోని బాలాజీ నగర్ గ్రామపంచాయతీ యువకులు కాంగ్రెస్ పార్టీ నుండి బి ఆర్ఎస్ పార్టీలో చేరారు. బాలాజీ నగర్ మాజీ సర్పంచ్ కమ్లి బిచ్చ నాయక్ ఆధ్వర్యంలో మాజీ జెడ్పిటిసి లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ దశరథ్ నాయక్ సమక్షంలో చేరారు దశరథ్ నాయక్ మాట్లాడుతూ రాబోవు జడ్పిటిసి ఎంపీటీసీ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ విజయం కోసం అందరం కలిసికట్టుగా పని చేయాలని తెలిపారు వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో కెసిఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయమని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీను నాయక్ నాయకులు పాండు శ్రీను నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా యూత్ కాంగ్రెస్ పని చేయాలి

**తేజస్వి ప్రకాశ్**




**కరీంనగర్, డిసెంబర్ 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** రానున్న మున్సిపల్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జిల్లా ఇంచార్జీ పెద్దెల్లి తేజస్వి ప్రకాశ్ పిలుపునిచ్చారు. ఎల్ఎండీ కాలనీలోని ప్రజాభవన్ సమావేశ మందిరంలో జరిగిన మానకొండూర్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పార్టీ బలోపేతం, ప్రభుత్వ పథకాల అమలు, ప్రజా సమస్యల పరిష్కారం కోసం యువజన కాంగ్రెస్ కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని తెలిపారు. పార్టీ కోసం కష్టపడితే తగిన గుర్తింపు, ప్రతిఫలం తప్పకుండా లభిస్తుందని, తన రాజకీయ ప్రస్థానం ఇందుకు ఉదాహరణ అని అన్నారు. యువజన కాంగ్రెస్ కార్యకర్తలు చేపట్టే ప్రతి కార్యక్రమాన్ని విత్ ఐవైసీ యాప్ లో అప్లోడ్ చేయాలని, అది భవిష్యత్తులో అవకాశాలకు దోహదం చేస్తుందని సూచించారు. త్వరలోనే గ్రామస్థాయి కమిటీలను ఏర్పాటు చేసి యువజన కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేస్తామని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ టికెట్లలో 20 శాతం యువజన కాంగ్రెస్ నాయకులకు కేటాయించేలా అధిష్ఠానం కృషి చేస్తోందని వెల్లడించారు. యువతే కాంగ్రెస్ భవిష్యత్తు అని, పార్టీ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే యువజన కాంగ్రెస్ లక్ష్యమని తేజస్వి ప్రకాశ్ స్పష్టం చేశారు. సమావేశంలో నియోజకవర్గ అధ్యక్షుడు అట్ల అనిల్, కమిటీ నాయకులు శానకొండ శరత్, ముంజ స్వాతి, మహేష్ చంద్ర, సిద్ధార్థ, అరవింద్, వైశాలి, ఇసాముద్దీన్, మండల అధ్యక్షులు కోండ్ర సురేష్, సందీప్, కర్రె మణికంఠ, ఆడేపు అజయ్, రాపోలు నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ చౌరస్తాలో డీసీఎంలు ఢీకొని ముగ్గురికి గాయాలు



**హుస్నాబాద్, డిసెంబర్ 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** హుస్నాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో మలుపు తీసుకుంటూ ఎదురెదురుగా వచ్చిన రెండు డీసీఎం వ్యాన్లు ఢీకొని ప్రమాదం జరిగింది. ఢీకొన్న ప్రభావంతో వ్యాన్ల ముందు భాగం పూర్తిగా దెబ్బతింది. అదే సమయంలో ఆటో స్టాండ్‌లో ఆగి ఉన్న ఒక ఆటో కూడా ప్రమాదంలో నుజ్జునుజ్జయింది. ఈ ఘటనలో ముగ్గురికి గాయాలు కావడంతో వారిని 108 అంబులెన్స్ ద్వారా ఆసుపత్రికి తరలించారు. సాధారణంగా వాహనాలతో రద్దీగా ఉండే అంబేద్కర్ చౌరస్తాలో ఉదయం పూట ట్రాఫిక్ తక్కువగా ఉండటంతో పెను ప్రమాదం తప్పింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు దెబ్బతిన్న డీసీఎం వ్యాన్లు, ఆటోను పక్కకు తరలించి ట్రాఫిక్‌ను సవ్యంగా కొనసాగించారు.

# రికవరీ చేసిన మొబైల్ ఫోన్లు బాధితులకు అందజేసిన కమిషనర్ - గౌస్ ఆలం

**కరీంనగర్ రూరల్, డిసెంబర్ 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను వెలికితీయడంలో సి.ఈ.ఐ.ఆర్ పోర్టల్ సాంకేతికతను సమర్థవంతంగా



వినియోగిస్తూ బాధితులకు ఊరట కలిగిస్తున్నారు. బుధవారం రూరల్ పోలీస్ స్టేషన్‌లో జరిగిన కార్యక్రమంలో సీపీ గౌస్ ఆలం ముఖ్య అతిథిగా పాల్గొని, 18.20 లక్షల విలువైన 91 మొబైల్ ఫోన్లను బాధితులకు స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా సీపీ గౌస్ ఆలం మాట్లాడుతూ, ఫోన్లను ట్రేస్ చేయడంలో అద్భుత ప్రతిభ కనబరిచిన టెక్నికల్ టీమ్ సభ్యులు విశ్వతేజ, రాంసాయి, కీర్తనలను ప్రత్యేకంగా అభినందించారు. వీరి కృషిని గుర్తించి త్వరలోనే రివార్డులు అందజేయాలని సూచించారు. వార్షిక గణాంకాలు (జనవరి 1 డిసెంబర్ 29, 2025) మొత్తం ఫిర్యాదులు 6,700, గుర్తించిన ఫోన్లు 3,939, బాధితులకు అప్పగించినవి 2,056 (52% సక్సెస్ రేటు), రికవరీలో ఉన్నవి 1,883. స్టేషన్ల వారీగా మానకొండూర్ (75%), కరీంనగర్ రూరల్ (73%) అత్యుత్తమ ఫలితాలు సాధించగా, చొప్పదండి, ఇల్లందకుంట, రామడుగు స్టేషన్లు 70% రికవరీతో మెరుగ్గా నిలిచాయి. కరీంనగర్ వన్ టౌన్ అత్యధికంగా 1,011 ఫోన్లను గుర్తించి రికార్డు సృష్టించింది. కార్యక్రమంలో ఏసీపీ విజయకుమార్, ఇన్స్పెక్టర్ నిరంజన్ రెడ్డి, ఎస్సైలు నరేష్, లక్ష్మా రెడ్డి మరియు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరేస్తాం

**- మేడిపల్లి సత్యం**




**కరీంనగర్, డిసెంబర్ 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం డిసిసి కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కరీంనగర్ కార్పొరేషన్‌తో పాటు జిల్లాలో మెజారిటీ స్థానాలను కాంగ్రెస్ పార్టీ గెలుచుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు.గత కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన సంక్షేమ పథకాలను కొనసాగిస్తూ, కొత్తగా ఆరోగ్య అంటీలు, మహిళలకు ఆర్టీసీ ఉచిత ప్రయాణం, 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్, రైతులకు రెండు లక్షల రుణమాఫీ వంటి పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. 60 వేల ఉద్యోగ నియామకాలు చేపట్టి నిరుద్యోగులకు ఊరట కల్పించామని, ప్రతి పేదవాడికి రేషన్ కార్డు అందజేసి సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని చెప్పారు. బిఆర్ఎస్ పాలనలో ఒక్క ఇల్లు కూడా పేదలకు కట్టలేదని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి సంవత్సరంలోనే 3500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి 80 శాతం నిర్మాణం పూర్తి చేసిందని వివరించారు. కొండగట్టు దేవాలయానికి బిఆర్ఎస్ ఒక్క రూపాయి నిధులు తీసుకురాలేదని, పవన్ కళ్యాణ్ సహకారంతో 36 కోట్ల రూపాయలు కేటాయించబడ్డాయని, జనవరి 3న ఆయనతో కలిసి 100 గదుల నిర్మాణానికి శంకుస్థాపన జరగనుందని తెలిపారు. కెసిఆర్ అసెంబ్లీలో కూర్చోవడానికి కూడా నామోషీగా ఫీల్ అవుతున్నారని, ప్రజా సమస్యలపై మాట్లాడకుండా రెండు నిమిషాలు హాజరై వెళ్లిపోయారని విమర్శించారు. బిఆర్ఎస్, బిజెపి ప్రజలకు దూరమైపోయాయని, తెలంగాణలో ఆ పార్టీలకు అవసరం లేదని అన్నారు.చొప్పదండి నియోజకవర్గంలో నారాయణపూర్ ప్రాజెక్టు పనులు పూర్తి చేసి, గంగాధరలో డిగ్రీ కాలేజ్, రామడుగులో అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు చేశామని తెలిపారు. త్వరలోనే కొండగట్టు జెఎన్టియును యూనివర్సిటీగా మార్చి, నియోజకవర్గాన్ని ఎడ్యుకేషన్ హబ్, ఇరిగేషన్ హబ్‌గా తీర్చిదిద్దుతామని మేడిపల్లి సత్యం ప్రకటించారు.సమావేశంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు అంజన్ కుమార్‌తో పాటు జిల్లా కాంగ్రెస్ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# కడ్తాల్ పిరమిడ్ లో ముగిసిన పత్రీజీ ధ్యాన మహాయాగం..






**కడ్తాల్, డిసెంబర్ 31 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం కైలాసపురిలోని మహేశ్వర మహాపిరమిడ్ లో నిర్వహించిన పత్రీజీ ధ్యాన మహాయాగం బుధవారం తో ఘనంగా ముగిసింది. డిసెంబర్ 21 నుంచి 31 వరకు అంగరంగ వైభవంగా జరిగిన పత్రీజీ ధ్యాన మహాయాగం ముగింపు సంబరాల్లో పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ మూవెంట్ సహావ్యవస్థాపకురాలు స్వర్ణమాల పత్రీ, ది పిరమిడ్ స్పిరుచ్యువల్ ట్రస్ట్ హైదరాబాద్ చైర్మన్ విజయభాస్కర రెడ్డి, బ్రహ్మర్షి పత్రీజీ కూతరు పరిణిత పత్రీ, ట్రస్ట్ సభ్యులు, సీనియర్ పిరమిడ్ మాస్టర్లు పాల్గొని జ్ఞాన సందేశం ఇచ్చారు. ఈ సందర్భంగా స్వర్ణమాల పత్రీ అమ్మ మాట్లాడుతూ ట్రస్ట్ సభ్యులు ఎంతో కృషి చేసి ధ్యానమహాయాగం అత్యంత అద్భుతంగా నిర్వహించారని కొనియాడారు. ఇంత పెద్ద కార్యక్రమాన్ని చేయడం అంత సులువు కాదని, ఎంతో నిబద్ధతతో, ఎంతో కృషి చేయడం వల్లనే ఇంత గొప్పగా విజయవంతం అయ్యిందని ప్రశంసించారు. అనంతరం ది పిరమిడ్ స్పిరుచ్యువల్ ట్రస్ట్ హైదరాబాద్ చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి మాట్లాడుతూ పత్రీజీ ధ్యానమహాయాగం అత్యంత అద్భుతంగా, ఎంతో



ప్రశాంతంగా జరిగిందన్నారు. బ్రహ్మర్షి పత్రీజీ చైతన్యంతోనే ఇది సాధ్యమైందన్నారు. 2026 లో కొత్త ప్రణాళిక రూపొందించి ముందుకు సాగుతామని చెప్పారు. 2026 సంవత్సరాన్ని పత్రీజీ మౌన ధ్యాన మహాయాగంగా నామకరణ చేస్తున్నట్లు చెప్పారు. ట్రస్ట్ సభ్యులు సేత్ బాలకృష్ణ మాట్లాడుతూ ఇంత ప్రశాంతంగా పత్రీజీ ధ్యాన మహాయాగం జరగడం ఒక అద్భుతమన్నారు. మిగతా యాగాలకు కూడా అందరూ ఇదేవిధంగా సహకరించాలని కోరారు. బ్రహ్మణరత్న మారం శివప్రసాద్ మాట్లాడుతూ పీఎస్ఎస్ఎం ఇంతింతై వటుండితై అన్నట్లుగా ఎదిగి ప్రపంచవ్యాప్తంగా విస్తరించిందని తెలిపారు, ఈ ఏడాది పత్రీజీ ధ్యాన మహాయాగం ఎంతో సులువుగా, ప్రశాంతంగా అద్భుతంగా జరిగిందన్నారు. అనంతరం మాట్లాడిన ఇతర ట్రస్ట్ సభ్యులు పత్రీజీ ధ్యాన మహాయాగం ఇంత అద్భుతంగా విజయవంతం కావడానికి ప్రతి పిరమిడ్ మాస్టర్ ఎంతో సహాయసహాకారాలు అందించారని వారందరికీ ధన్యవాదాలు తెలియజేసారు. ఆతర్వాత స్వర్ణమాల పత్రీ అమ్మ కేక్ కట్ చేసి ముగింపు వేడుకల సంబరాలు జరుపుకొని కార్యక్రమాన్ని ఘనంగా ముగించారు.

# కాకతీయ కాలువకు నీరు విడుదల

**మానకొండూర్, డిసెంబర్ 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
దిగువ మానేరు డ్యామ్ నుండి కాకతీయ కాలవకు మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ నీటిని విడుదల చేశారు. ఎల్ఎండీ హెడ్ రెగ్యులేటర్ వద్ద సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, ఎస్సారెస్పీ అధికారులు పాల్గొనగా, ఎమ్మెల్యే స్విచ్ఛాన్ చేసి నీటిని కాలువలోకి ప్రవేశపెట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రబీ పంటలకు సాగునీరు అందించేందుకు ప్రతి రోజు 5000 క్యూసెక్కుల చొప్పున మార్చి చివరి వరకు నీరు విడుదల చేస్తామని తెలిపారు. మొత్తం 6,90,695 ఎకరాల ఆయకట్టుకు 45.175 టీఎంసీల నీటి అవసరమని, ఆ అవసరాన్ని తీర్చేందుకు ఆరు



తడులకు 90 రోజులపాటు నీరు అందిస్తామని చెప్పారు.ఎల్ఎండీ నుంచి విడుదలైన నీరు మూడు జోన్లలోని ఆయకట్టుకు చేరుతుందని వివరించారు. 1వ జోన్‌లో కరీంనగర్, మానకొండూర్, హుజూరాబాద్, పరకాల, భూపాలపల్లి, నర్సంపేట, మహబూబాబాద్, వర్ధన్నపేట మండలాల్లోని 3,51,541 ఎకరాలకు, 2వ జోన్‌లో వర్ధన్నపేట నుంచి పాలకుర్తి, పాలేరు, మధిర, తుంగతుర్తి, సూర్యాపేట, కోదాడ మండలాల్లోని 3,39,154 ఎకరాలకు నీరు అందుతుందని తెలిపారు.రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో ఎస్సారెస్పీ ఇంజినీర్లు, తిమ్మాపూర్ తహసీల్దార్ కర్ర శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు తుమ్మనపల్లి శ్రీనివాసరావు, మోరపల్లి రమణారెడ్డి, గోపు మల్లారెడ్డి, మామిడి అనిల్ కుమార్, కొత్త తిరుపతిరెడ్డి, చింతల లక్ష్మారెడ్డి, గొట్టెముక్కుల సంపత్ రెడ్డి, కొమ్మెర రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాలకు రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ఆర్థిక సాయం

**అధైర్య పడొద్దు పేదలకు అండగా తన ట్రస్ట్ ఉందన్న దశరథ్ నాయక్**



**కడ్తాల్, డిసెంబర్ 31 ( నీలగిరి ఎక్స్‌ప్రెస్ )**
కడ్తాల్ మండలంలోని రావిచెడు గ్రామంలో కుమ్మరి విజయ, సాలార్పూర్ గ్రామంలో నేనావత్ కిశాని మృతి చెందారు. వారి మృత దేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. రెండు కుటుంబాలకు పరామర్శించి తన ట్రస్టు ద్వారా 5వేల రూపాయల చొప్పున రెండు కుటుంబాలకు 10 వేల రూపాయలు కడ్తాల్ మాజీ జెడ్పిటిసి లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జర్పుల దశరథ్ నాయక్ అందించారు. వారి కుటుంబాన్ని పరామర్శించి కడ్తాల్ మండలంలో పేదలకు తమ ట్రస్టు అండగా ఉంటుందని మనోధైర్యాన్ని కల్పించడం జరిగింది. సాలార్పూర్ సర్పంచ్ ప్రియా రమేష్ నాయక్ నేనావత్ కిషని కుటుంబానికి 3వేల రూపాయలు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గోపాల్, ఉపసర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపీపీ సువాలీ పంతు, ఎంపిటిసి యాదయ్య, గ్రామ కమిటీ అధ్యక్షుడు రమేష్, వార్డు సభ్యులు మల్లేష్,పవన్,సువాలి, రాములు,సరిత, పాండు, నాయకులు బాలకృష్ణ, బాబా, రమేష్, లింగం, దాస్య,పాండు, గోపాల్, బీమా, తార్య, రామచంద్రి, రవికుమార్, శేఖర్,నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# నిండు ప్రాణాన్ని రక్షించిన మహేశ్వరం పోలీసులు





**మహేశ్వరం, డిసెంబర్ 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలంలో మానవత్వాన్ని నిలబెట్టిన ఘనత మహేశ్వరం పోలీసులకు దక్కింది.గట్టుపల్లికోళ్ల పడకల్ మార్గంలో కొత్తపేట గ్రామానికి చెందిన గడ్డమీది కుమార్ ఆత్మహత్యకు యత్నిస్తున్నాడని 100 నెంబర్‌కు సమాచారం అందడంతో, మహేశ్వరం పోలీస్ పెట్రోల్ మొబైల్ కేవలం 4 నిమిషాల్లో ఘటనాస్థలానికి చేరుకుంది. కానిస్టేబుల్ వెంకటేష్, హోంగార్డు నరసింహులు అప్రమత్తంగా స్పందించి, బాధితుడి ప్రాణాన్ని కాపాడారు.వివరాల ప్రకారం, కుమార్ తన అత్తగారి ఊరైన గట్టుపల్లికి వచ్చి, అక్కడ తిట్టుకోవడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు ప్రయత్నించాడు. అయితే పోలీసులు అతన్ని సురక్షితంగా నిలిపి, కుటుంబ సభ్యులకు సమస్యను వివరించి గొడవలు లేకుండా ఉండాలని సూచించారు.గ్రామస్తులు ప్రాణరక్షకులైన కానిస్టేబుల్ వెంకటేష్, హోంగార్డు నరసింహులను హర్షధ్వానాలతో అభినందించారు.

# నాగిరెడ్డిపల్లి రైతులతో జిల్లా కలెక్టర్ కి నదిపత్రం అందజేసిన నడుకుడ శివ



**మహేశ్వరం, డిసెంబర్ 31(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలోని నాగిరెడ్డిపల్లి గ్రామ రైతులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డికి వినిపించారు. మహేశ్వరం నియోజకవర్గ కార్మిక శాఖ అధ్యక్షులు నడికుడ శివ ఆధ్వర్యంలో రైతులు కలెక్టర్‌ను కలసి, గ్రామంలో టీజీఐసి స్వాధీనం చేసుకున్న భూముల కారణంగా నష్టపోతున్న రైతులకు తగ్గిన నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా ఇందిరమ్మ కమిటీ అధ్యక్షులు మిద్దె శ్రీకాంత్ రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షులు కొండూరు గణేష్, యూత్ అధ్యక్షులు నడికుడ కార్తీక్, రైతులు నడికుడి బిక్షవతి, కాట్రవ చక్ర, కేతవత్ మూల్యా, సౌర్య రతన్ తదితరులు పాల్గొన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని వారు కలెక్టర్‌ను అభ్యర్థించారు.

## కోలన్ గూడా గ్రామ సర్పంచ్‌గా ప్రమాణ స్వీకారం చేసిన గోరికల బీరప్ప



**కందుకూరు, డిసెంబర్ 31(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం కందుకూరు మండల కేంద్రంలోని కోలన్ గూడా గ్రామ సర్పంచ్‌గా గోరికల బీరప్ప బుధవారం ఘనంగా ప్రమాణ స్వీకారం చేశారు. 22వ తేదీన జరగవలసిన ప్రమాణ స్వీకారం అయ్యప్ప మాలలో ఉండటం వల్ల వాయిదా పడగా, ఈరోజు ఆయన బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా ఉపసర్పంచ్‌గా బండ వేణు ప్రమాణ స్వీకారం చేయగా, వార్డు సభ్యులుగా ఆధర్ల కవిత, ఆధర్ల సుహాసిని, ఆధార్ వెంకటేష్, బండ జగన్, ఆదరణ శ్రీకాంత్, బండ విజయ, రాసూరి జ్యోతి ప్రమాణ స్వీకారం చేశారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గుమ్మడవెల్లి సర్పంచ్ పల్స మహేష్ గౌడ్ హాజరై, నూతనంగా ఎన్నికైన సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై కొత్త ప్రజాప్రతినిధులను అభినందించారు.

## రాష్ట్ర ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన చిక్కిరి శ్రీకాంత్



**మహేశ్వరం, డిసెంబర్ 31(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రంగారెడ్డి జిల్లా (టిఎస్ఎస్ఓ) తెలంగాణ సామాజిక స్టూడెంట్ ఆర్గనైజేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చిక్కిరి శ్రీకాంత్ రాష్ట్ర ప్రజలకు నూతన సంవత్సర శు భాకాంక్షలు తెలిపారు. కొత్త సంవత్సరంలో ప్రతి ఒక్కరూ కుటుంబ సభ్యులతో ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొత్త సంవత్సరం ప్రతి ఒక్కరి జీవితంలో కొత్త ఆశలు, కొత్త అవకాశాలు తీసుకురావాలని, భగవంతుని ఆశీస్సులు ఎల్లప్పుడూ అందరిపై ఉండాలని కోరుకున్నారు. మన తెలుగు రాష్ట్రాలలో జరుపుకునే ఉగాది పండుగ పంచాంగం ప్రకారం కొత్త సంవత్సరానికి ఆరంభమని, అందువల్ల ఇంగ్లీష్ నూతన సంవత్సరాన్ని కాకుండా మన సంప్రదాయ ఉగాది పండుగను జరుపుకోవాలని ప్రజలకు సూచించారు.

## స్నేహ బంధానికి 36 ఏళ్లుగా ఒకే వేదిక కొండగట్టు



**కరీంనగర్, డిసెంబర్ 31(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కరీంనగర్ జిల్లాకు చెందిన ఆరుగురు చిన్ననాటి మిత్రులు స్నేహానికన్న మిన్న లోకాన లేదని చాటి చూపుతూ, ప్రతి సంవత్సరం డిసెంబర్ 31న ఏ ప్రాంతంలో ఉన్నా కొండగట్టులో కలుసుకోవడం ఆనవాయితీగా కొనసాగిస్తున్నారు. అంజన్న దర్శనం చేసుకొని తీర్థప్రసాదాలను స్వీకరించడం, ఒకరినొకరు బాగోగులు తెలుసుకోవడం, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకోవడం ఈ స్నేహ బంధానికి ప్రత్యేకతగా నిలుస్తోంది.ఈ సంవత్సరం కూడా వారు కొండగట్టులో కలుసుకొని అంజనేయ స్వామి దర్శనం చేశారు. 36 సంవత్సరాలుగా ఈ విధంగా కలుసుకోవడం మాకు అపారమైన ఆనందాన్ని ఇస్తోందని చెల్లోజు లక్ష్మణ చారి, బౌతు రవీందర్, పంతం సత్యం, లక్కాకుల చంద్రశేఖర్, శ్యాంసుందర్, శివారెడ్డి పేర్కొన్నారు.

## ప్రతి ఒక్కరికి 2026 సంవత్సరము ఎంచుకున్న లక్ష్య సాధనకు పునాది రాయి గా మారాలి

“నేర్చుకోవడం ఎప్పటికీ ఆగదు నేర్చుకోవడం ఎక్కడ ఆగిపోతుందో, ఎదుగుదల కూడా అక్కడే ముగిసిపోతుంది.“ వేగంగా మారుతున్న ప్రపంచంలో, ఉత్సాహంగా ఉండటం అనేది కేవలం ఒక ప్రయోజనం కాదు, అది ఒక అవసరం.చదవండి. వినండి. ప్రశ్నలు అడగండి.వైఫల్యం, అభిప్రాయం మరియు నిశ్శబ్దం నుండి కూడా నేర్చుకోండి.పాత ఆలోచనలను సవాలు చేయండి. కొత్త నైపుణ్యాలను స్వీకరించండి.జీవితాన్ని ఎల్లప్పుడూ ఒక విద్యార్థిగా ఉండండి.అన్ని తెలిసినవారు అత్యంత విజయవంతమైన వ్యక్తులు కారు, నిరంతరం నేర్చుకునే వారే అత్యంత విజయవంతమైన వ్యక్తులు.ప్రతిరోజూ మీ మనసు(బ్రెయిన్ )కు ఆహారం ఇవ్వండి. మీ




భవిష్యత్తు దానిపై ఆధారపడి ఉంటుంది.సమయాన్ని సద్వినియోగం చేసుకోవడం ,ప్రణాళిక బద్ధంగా సమయాన్ని ఖర్చు చేయకుండా సమయాన్ని ఇన్వెస్ట్మెంట్ మానసవ వనరుల మీద చేయగలగడం.ముందు చూపు భవిష్యత్ కి పునాదిగా అడుగులు వేయడం గొప్ప నిర్ణయాలు తీసుకొని ఆచరించి అమలు చేయగలిగితేఅనుకున్న లక్ష్యం ,నెరవేరాలంటే లక్ష్యం ఆశయంగా మారాలి.అది 2026 పునాది గా భావించి ముందుకు ప్రయాణిస్తే విజయం ఒక నిరంతర గమ్యంగా మారితే అదే ఒక గొప్ప మలుపు.

**నూతన సంవత్సర శుభాకాంక్షలతో.**

మీ కామేపల్లి లక్ష్మయ్య
ఎం.ఏ. ఎం ఎస్ సి. బిఈడి. డి ఈ డి కాలమిస్టు.



## హిందూ సామ్రాజ్యాధిపతి ఛత్రపతి శివాజీ ఆశయాలను కొనసాగిద్దాం

**కొందుర్గు, డిసెంబర్ 31(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కొందుర్గు మండలంలోని ఉత్తరాసిపల్లి గ్రామంలో ఛత్రపతి శివాజీ యూత్ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ స్థాపనకు భూమిపూజ కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి బిజెపి రాష్ట్ర నాయకులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి హాజరై భూమిపూజ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామ యువత ముందుకు వచ్చి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం సంతోషకరమని, 16వ శతాబ్దంలో శివాజీ మహారాజ్ తీసుకొచ్చిన చైతన్యం ఇప్పుడు ఉత్తరాసిపల్లిలో ప్రతిధ్వనించడం ఆనందదాయకమని పేర్కొన్నారు. హిందూ ధర్మస్థాపన కోసం ఆయుధం పట్టిన శివాజీ మహారాజ్ చరిత్రను సమాజానికి తెలియజేయడం మనందరి బాధ్యత అని, భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుతూ మహనీయుల



ఆశయాలను కొనసాగించాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో బిజెపి కొందుర్గు మండల అధ్యక్షులు చిట్టెం లక్ష్మీకాంత్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు బోయ శంకర్, జిల్లా కౌన్సిల్ సభ్యులు ఈసరి సత్యనారాయణ, శివాజీ యూత్ అధ్యక్షులు మాణిక్య ప్రభు, ఉపాధ్యక్షులు సాయిచరణ్, సీనియర్ నాయకులు శివారెడ్డి, మోహన్ సింగ్, చేగు సుధాకర్ అప్ప, రంగన్న గౌడ్, గ్రామ పెద్దలు అంజిరెడ్డి గోపాలరావు, విజయ్, తమ్మలి నందు, సత్యం, మహేష్, వార్డ్ మెంబర్ పోతుల శ్రీకాంత్, కమ్మరి రాజు, రామరాజు, దినేష్ రెడ్డి, మంగలి బుగ్గయ్య, మంగ రమేష్, పొట్ట సత్యం, పొట్ట శివకుమార్, శివాజీ యూత్ సభ్యులు చాకలి రమేష్, బోయ రాజు, బోయ రామస్వామి, ఎంమల్లేష్, సాలె మహేష్, బ్యాగరి రవికుమార్, మల్ల రమేష్, మల్ల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన ఆంగ్ల సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన సామాజిక కార్యకర్త నీల రవీందర్



**షాద్ నగర్, డిసెంబర్ 31(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
సామాజిక కార్యకర్త నీల రవీందర్ రాష్ట్ర ప్రజలకు నూతన ఆంగ్ల సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. పాత జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ, కొత్త ఆశలకు ఊపిరి పోస్తూ, ఈ కొత్త సంవత్సరం ప్రతి ఒక్కరి జీవితంలో సంతోషం, ఆరోగ్యం, విజయాలు నిండాలని ఆయన ఆకాంక్షించారు.అదేవిధంగా, “గెలుపు మీ చిరునామా కావాలి, సంతోషం మీ ఇంటి పేరు కావాలి. ఈ 2026 మీకు అప్రతిహతమైన విజయాలను అందించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను” అని నీల రవీందర్ అన్నారు.

## మున్సిపాలిటీలోని వార్డుల ఓటర్లను సవరించాలి



**ఆమనగల్లు, డిసెంబర్ 31(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని 15 వార్డుల్లో ఉన్న ఓట్లను వార్డుల వారిగా విభజించాలని బుధవారం మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్ కు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఒకటవ వార్డు చంద్రాయన్ పల్లి తండా పరిధిలోని కాటన్ మిల్లు ఓట్లను తొలగించి తండా వరకే కొనసాగించాలని, రెండవ వ వార్డు ముర్తోజుపల్లి లోని సాకిబండ తండా ఓట్లు ఉన్నందున అక్కడి నుంచి తొలగించి, నాల్గవ వ వార్డు పరిధిలోని జంగారెడ్డి పల్లి ఓట్లు నుచ్చుకుంట తండాలో ఉన్నాయి. అక్కడ ఉన్న ఓట్లను తొలగించి జంగారెడ్డిపల్లి లో ఏర్పాటు చేయాలని, తొమ్మిదవ వార్డు ఓట్లు విఠాయిపల్లి లో ఉన్నాయి. విఠాయిపల్లి లో ఉన్న ఓట్లను విఠా యిపల్లిలోనే కొనసాగించాలని, అదేవిధంగా వివిధ వార్డుల్లో ఉన్న ఓటర్లను కూడా వార్డుల వారీగా విభజించాలని వినతిపత్రంలో కమిషనర్ ను కోరారు. వినతి అందించిన వారిలో మాజీ సర్పంచ్ గుర్రం కేశవులు, తోట శ్రీను, మాజీ కోఆప్షన్ మెంబర్ ఖాదర్ ఖాద్రి, కృష్ణ నాయక్, పూసల సత్యం, మల్లేష్ నాయక్, చెన్నారెడ్డి, మైసయ్య, కుమార్ గౌడ్, శ్రీను నాయక్, ఖాదర్, హలీం, నాజర్, రఫీ, వాటర్ బాబా, మహేష్, పాతకోట రాజు, గౌస్, ఎంగలి ప్రసాద్, జైపాల్ తదితరులు ఉన్నారు.

## డాక్టర్ శ్యాంసుందర్ పర్యవేక్షణలో నట్టల మందు నివారణ చర్యలు

**వెల్దండ, డిసెంబర్ 31(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
వెల్దండ మండల పరిధిలోని రాఘయిపల్లి, శంకర్కొండ తండా, బండోన్‌పల్లి గ్రామాల్లో గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు త్రాగించడం జరిగింది. పశువుల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని డాక్టర్ శ్యాంసుందర్ పర్యవేక్షించారు.ఈ సందర్భంగా సర్పంచ్ సామ వెంకటయ్య, ఇస్లావత్ రవీందర్, ఎనుముల సంగీత రెడ్డి, ఉపసర్పంచ్ మెండే కొండల్, వవిల్ల అల్వాల్ యాదవ్, గ్రామ రైతులు శవ్వ కుమార్, రామావత్ రాములు, ఇస్లావత్ మౌనిక, మెండే బాలయ్య, ఇస్లావత్ గోపాల్, శవ్వ మల్లేష్, మండే యశోద పాల్గొన్నారు.పశువైద్య సిబ్బంది నరేష్ రెడ్డి, నరసింహ, ఫణిందర్ రెడ్డి, తిరుపతయ్యతో పాటు గోపాలమిత్రలు మొగులయ్య, సాయిబాబా, బాలు, విజేందర్ తదితరులు కూడా ఈ కార్యక్రమంలో భాగమయ్యారు. గ్రామస్థులు పెద్ద సంఖ్యలో హాజరై పశువుల ఆరోగ్య పరిరక్షణకు తోడ్పాటునందించారు.



# బాధితుడికి ఇచ్చిన హామీ అమలయ్యేనా?

- ఆమనగల్లు ప్రభుత్వ దవాఖానాలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్ వికటించి మృతి చెందిన మహిళ
- ఘటన జరిగి 13 ఏళ్లు అయినా ప్రభుత్వం ఇచ్చిన హామీ నెరవేరలేదు
- రూ 10 లక్షలు, ప్రభుత్వ ఉద్యోగం, పిల్లలకు చదువు ఏ ఒక్క హామీ అమలు కాలే



**ఆమనగల్లు, డిసెంబర్ 31(నీలగిరి ఎక్స్‌ప్రెస్)** ఆమనగల్లు ప్రభుత్వ దవాఖానలో కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స వికటించి ప్రాణాలు కోల్పోయిన జరీనా బేగం కుటుంబానికి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నేటికీ అమలు కాలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో ఎన్నో ప్రభుత్వాలు మారినా, బాధిత కుటుంబం జీవితమే మార్చేలా ఇచ్చిన మాటలు మాత్రం అధికార ప్రసంగాల్లోనే మిగిలిపోయాయని వేదన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ఆమనగల్లు దవాఖనలో 2013 నవంబర్ 4న కుటుంబ నియంత్రణ శిక్షణ శిబిరం నిర్వహించారు. ఆమనగల్లు పట్టణానికి చెందిన జరీనా బేగం (జ్యోతి) శస్త్రచికిత్స చేయించుకునేందుకు హాజరైంది. వైద్యపరమైన లోపాలు వెలుగులోకి రావడంతో ఆపరేషన్ వికటించి జరీనా అక్కడికక్కడే మృతి చెందింది. అనూహ్యంగా జరిగిన ఈ ఘటనతో కుటుంబ సభ్యులు, స్థానిక ప్రజలు, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు పెద్దఎత్తున ఆసుపత్రికి తరలివచ్చి నిరసనలు వ్యక్తం చేశారు. ప్రజల ఆగ్రహం ఎదుర్కొన్న అధికారులు అప్పట్లో బాధిత కుటుంబాన్ని ఓదారుస్తూ తక్షణ సహాయంగా రూ.2 లక్షలు అందజేశారు. అంతేకాక భర్త గౌస్‌కు ఉద్యోగం కల్పిస్తామన్న హామీ కూడా నోటి మాటగా ఇచ్చారు. అయితే ఆ రోజున ఇచ్చిన మాటలు అక్కడికక్కడే ఆగిపోయి, ఫైళ్ల గుట్టల్లో మునిగిపోయిందని బాధిత కుటుంబం చెబుతోంది. జరీనాకు ఇద్దరు పాపలు, ఒక బాబు ఉన్నారు. తల్లి మరణం తర్వాత ముగ్గురు పిల్లల భవిష్యత్తు తండ్రి గౌస్ భుజాలపై మోపబడింది. అప్పటి నుండి గౌస్ ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ కుటుంబాన్ని గడపాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ పాఠశాలలోనే పిల్లలను చదివిస్తూ ఎట్లాగో ఒకట్లా జీవనం కొనసాగిస్తున్నాడు. సామాన్యుడి జీవితంలో ప్రభుత్వ ఉద్యోగం ఒక ఆశ్రయం లాంటిది. కానీ తన భార్య ప్రాణాలు కోల్పోయినప్పటి నుంచి ఇచ్చిన ఆ మాట ఇప్పటికీ నెరవేరనందుకు గౌస్ ఆవేదన చెందుతున్నాడు. "ఆ రోజున ఇచ్చిన మాటలు మాటలుగానే మిగిలిపోయాయి. నన్ను ఓదార్చినవారు చాలామంది ఉన్నాడ న్యాయం చేసినవారెవరూ లేరు. నా పిల్లల భవిష్యత్తు అలా గాలిలో వేలాడుతూనే ఉంది" అంటూ గౌస్ వేదన వ్యక్తపరిచాడు. ఇటీవల ఇబ్రహీంపట్నంలో చోటుచేసుకున్న ఇలాంటి ఘటన తన గుండెను మరోసారి గాయపరిచిందని, ఇలాంటి సంఘటన మరెవరికి జరగకూడదని కోరుకున్నాడు. ఘటన జరిగిన 13 ఏళ్లు గడిచినప్పటికీ ఆ రోజున ప్రకటించిన సహాయాలు, హామీలు శాసనాల్లో చోటు దక్కినాడ అమలు మాత్రం జరగలేదు. సాధారణ కుటుంబం నమ్మిన మాటలు నెరవేరేనా లేక ప్రజా ఒత్తిడి తగ్గాక మరచిపోతారా అన్న ప్రశ్నతో బాధితులు ఇప్పటికీ ఎదురు చూస్తున్నారు. జరీనా బేగం కుటుంబం ఆశ ఒకటే ప్రభుత్వం ఇచ్చిన మాటలు నెరవేరి తమ పిల్లల భవిష్యత్తుకు వెలుగు నింపాలని.

# ఏసీపీ కార్యాలయం ఏర్పాటు హర్షనీయం

మార్కెట్ కమిటీ మాజీ మాజీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు



**ఆమనగల్లు, డిసెంబర్ 31(నీలగిరి ఎక్స్ ప్రెస్):** శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ఆమనగల్లు మండల కేంద్రంలో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, ఎంపీ మల్లు రవిల కృషితో ఏసీపీ కార్యాలయం ఏర్పాటు చేయడం అభినందనీయమని ఆమనగల్లు మార్కెట్ కమిటీ మాజీ మాజీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు అన్నారు. నాలుగు మండలాలకు ప్రధాన కూడలి అయిన ఆమనగల్లు మండల కేంద్రంలో ఎమ్మెల్యే, ఎంపీ సహకారంతో అతి త్వరలో సబ్ రిజిస్టర్, ఎస్టీవో, అన్ని డివిజన్ కార్యాలయం ఏర్పాటు చేస్తామని తెలిపారు. డివిజన్ కార్యాలయం ఏర్పాటుతో ఈ ప్రాంత ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో తోట శ్రీను, మాజీ కోఆప్షన్ మెంబర్ ఖాదర్ ఖాద్రి, కృష్ణ నాయక్, పూసల సత్యం, మల్లేష్ నాయక్, చెన్నారెడ్డి, మైసయ్య, కుమార్ గౌడ్, శ్రీను నాయక్, ఖాదర్,ఆలీం, నాజర్, రఫీ, వాటర్ బాబా, మహేష్, పాతకోట రాజు, గౌస్, ఎంగలి ప్రసాద్, జైపాల్ తదితరులు పాల్గొన్నారు.

# తలారి వెంకటేశ్వర్లు ఆశయాలు కొనసాగిస్తాం

- 13 వ వర్ధంతి సభలో సిపిఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వి అజయ్ సారథి రెడ్డి



**మహబూబాబాద్, డిసెంబర్ 31(నీలగిరి ఎక్స్ ప్రెస్)** : నేడు భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ మాజీ పట్టణ సహాయ కార్యదర్శి, ప్రజానేత అమరజీవి తలారి వెంకటేశ్వర్లు 13 వ వర్ధంతి కార్యక్రమం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సెంటర్లో నేడు ఘనంగా నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సిపిఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి అజయ్ సార్ రెడ్డి తలారి వెంకటేశ్వర్లు గారికి ఘన నివాళులు అర్పించి అనంతరం మాట్లాడుతూ తలారి వెంకటేశ్వర్లు సేవలు మరువలేనివి అన్నారు పట్టణ సహాయ కార్యదర్శిగా పాత బజార్ ప్రాంతంలో ఉద్యమాన్ని ముందుకు నడిపించిన గొప్ప వ్యక్తి తలారి వెంకటేశ్వర్లు అన్నారు తెలంగాణ ఉద్యమకారుడుగా మరియు భూపోరాటాలలో తన వంతు పాత్ర పోషించి అనేక ఉద్యమాలు ఈ ప్రాంతంలో నడిపించిన వ్యక్తి తలారి వెంకటేశ్వర్లు అన్నారు ఎవరికి బాధ ఆపదలో నేనున్నా అంటూ ధైర్యం చెప్పే తలారి వెంకటేశ్వర్లు గారు లేకపోవడం బాధాకరమని ఆయన స్ఫూర్తితో ఆయన ఆశయాలను ముందుకు తీసుకుపోతామని ఈ సందర్భంగా తలారి వెంకటేశ్వర్లు స్ఫూర్తితో ఈ ప్రాంతంలో పార్టీని ముందుకు తీసుకుపోయి ఈ ప్రాంతంలో వార్డు కౌన్సిలర్లు గెలిచే విధంగా కార్యకర్తలు పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తలారి వెంకటేశ్వర్లు కుమార్తె తలారి కుమారి మరియు పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, వెలుగు శ్రవణ్,నర్రా శ్రావణ్, ఆబోతు అశోక్, జలగం ప్రవీణ్, వంకాయలపాటి చిరంజీవి, మిర్యాల మల్లికార్జున్, రాగం మల్లయ్య, పూల భద్రయ్య, చిలువేరు వికాస్, మంద శంకర్, ఐలయ్య తండ్రి శ్రీనాద్, బాలాజీ, వేణు, కృష్ణ, వెంకన్న, నర్సమ్మ, రాజు, శ్రీనివాస్,రవి, రాంప్రసాద్, లక్ష్మి, రమ తదితరులు పాల్గొన్నారు.

# 9వ నేషనల్ ఫెడరేషన్ కప్ వుషు ఛాంపియన్‌షిప్‌లో మెరిసిన మానుకోట ఆణిముత్యాలు



**మహబూబాబాద్, డిసెంబర్ 31(నీలగిరి ఎక్స్ ప్రెస్)** : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని కరాటే ఉష సిస్టర్స్ అకాడమీ క్రీడాకారులు జాతీయ స్థాయిలో తమ ప్రతిభను చాటుతూ తెలంగాణా కీర్తిని దేశవ్యాప్తంగా నిలబెట్టారు. డిసెంబర్ 24 నుండి 30 వరకు జరిగిన 9వ ఫెడరేషన్ నేషనల్ వుషు ఛాంపియన్‌షిప్ 2025లో వారు అద్భుతమైన ప్రదర్శన కనబరిచారు. నేషనల్ లెవెల్ సీనియర్ విభాగంలో అయేషా తస్నీమ్ కాంస్య పతకం సాధించగా, జూనియర్ విభాగంలో సోహా తబస్సుం కాంస్య పతకాన్ని గెలుచుకుంది. సబ్ జూనియర్ విభాగంలో ఏండీ రుబీనా కాంస్య పతకాన్ని సాధించి తెలంగాణా ఛాంపియన్లుగా మెరిసారు. మహబూబాబాద్‌కు తిరిగి వచ్చిన సందర్భంగా క్రీడాభిమానులు రైల్వే స్టేషన్‌లోనే వారిని ఘనంగా ఆహ్వానించి పూలమాలలతో సత్కరించి శుభాకాంక్షలు అందజేశారు. తెలంగాణా కోచ్ సనాఉల్లా ప్రత్యేకంగా అభినందిస్తూ, భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించి రాష్ట్ర కీర్తిని ఇనుమడింపజేయాలని ఆకాంక్షించారు.

# ఏబీవీపీ రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరణ




**మహబూబాబాద్, డిసెంబర్ 31(నీలగిరి ఎక్స్ ప్రెస్)** మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని అంబెడ్కర్ విగ్రహం ఎదుట అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) 44వ రాష్ట్ర మహాసభల గోడపత్రికలను రాష్ట్ర కార్యదర్శి మాచర్ల రాంబాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం జనవరి 3, 4, 5 తేదీలలో హైదరాబాద్ శంషాబాద్‌లో జరిగే మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మహాసభలకు త్రిపుర రాష్ట్ర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి ముఖ్య అతిథిగా హాజరవనున్నారని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యారంగాన్ని భ్రష్టు పట్టించిందని విమర్శించిన ఆయన, కాంగ్రెస్ ప్రభుత్వం కూడా రెండు సంవత్సరాల పాలనలో ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుందని అన్నారు. 8,500 కోట్ల రూపాయల ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిరంతరం ఉద్యమాలతో విద్యార్థుల సమస్యలపై గళమెత్తుతున్న ఏకైక విద్యార్థి సంఘం ఏబీవీపీ అని రాంబాబు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ జిల్లా నేతలు అఖిల్, రాము, శేఖర్, కార్తిక్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పదవీ విరమణ సన్మానం




**మంథని, డిసెంబర్ 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** ఉద్యోగ జీవితంలో పదవీ విరమణ తప్పనిసరి అని పెద్దపల్లి జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కల్పనా అన్నారు. మంథని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సయ్యద్ సలీం పదవీ విరమణ సందర్భంగా బుధవారం నిర్వహించిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కల్పనా మాట్లాడుతూ, సలీం 30 సంవత్సరాలకుపైగా ఉపాధ్యాయ, అధ్యాపక జీవితంలో అనేకమందిని ఉన్నత స్థానాల్లో నిలిపారని, విధుల్లో క్రమశిక్షణ పాటింపజేయడంలో ముందుండేవారని గుర్తుచేశారు. ఆయనతో ఎన్నో ఏళ్లుగా కలిసి పనిచేసిన అనుభవాన్ని పంచుకుంటూ, పదవీ విరమణ తర్వాత కుటుంబంతో ఆనందంగా గడపాలని సూచించారు. సలీం పాఠశాల ఉపాధ్యాయ స్థాయి నుంచి కళాశాల ప్రిన్సిపల్‌గా ఎదిగి, విద్యా రంగానికి విశేష సేవలు అందించారని ఆమె కొనియాడారు. అనంతరం ఆయనను ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో సిద్దిపేట డిఐఈఓ, ప్రిన్సిపల్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే. రవీందర్ రెడ్డి, మంచిర్యాల డిఐఈఓ అంజయ్య, జిల్లాలోని ప్రభుత్వ కళాశాలల ప్రిన్సిపాళ్లు, రిటైర్డ్ ప్రిన్సిపాళ్లు, పూర్వ మరియు ప్రస్తుత విద్యార్థులు, అభిమానులు పాల్గొన్నారు.

# 69వ జాతీయ పాఠశాల క్రీడల్లో మెరిసిన చిన్నారి దసరాపు సుకృతకి ఎస్పీ అభినందనలు



**మహబూబాబాద్,డిసెంబర్ 31(నీలగిరి ఎక్స్ ప్రెస్)** మహారాష్ట్ర రాష్ట్రం సాంభాజీనగర్‌లో డిసెంబర్ 22 నుండి 25 వరకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన 69వ జాతీయ పాఠశాల క్రీడల్లో మహబూబాబాద్ జిల్లా చిన్నారి దసరాపు సుకృత ప్రతిభను చాటింది. ఫెన్సింగ్ పోటీల్లో కాంస్య పతకం సాధించి తెలంగాణ రాష్ట్రానికి గౌరవాన్ని తీసుకువచ్చింది. గీతాంజలి హై స్కూల్‌లో 6వ తరగతి చదువుతున్న సుకృత, మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సీసీ దసరాపు చంద్రకాంత్ కుమార్తె. చిన్న వయస్సులోనే క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించుకొని క్రమశిక్షణతో సాధన చేస్తే గొప్ప విజయాలు సాధించవచ్చని సుకృత నిరూపించిందని జిల్లా ఎస్పీ అభినందించారు. చదువుతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యం ఇస్తూ, సమయపాలన, శ్రమ, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగితే అంతర్జాతీయ స్థాయిలోనూ ప్రతిభ చాటవచ్చని ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా కుమార్తె భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని చిన్ననాటి నుంచే క్రీడలపై ఆసక్తిని ప్రోత్సహిస్తూ శిక్షణ, సాధన, పోటీలకు సంపూర్ణ సహకారం అందించిన తండ్రి దసరాపు చంద్రకాంత్ అంకితభావం ప్రశంసనీయం అని ఎస్పీ అన్నారు. తల్లిదండ్రుల సహకారం, ప్రోత్సాహమే పిల్లల విజయానికి బలమైన పునాదిగా మారుతుందని ఆయన పేర్కొన్నారు. సుకృత సాధించిన ఈ విజయం జిల్లాలోని విద్యార్థులు, యువ క్రీడాకారులకు ఆదర్శంగా నిలుస్తుందని, భవిష్యత్తులో ఆమె మరిన్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయి విజయాలు సాధించాలని ఎస్పీ ఆకాంక్షించారు.





# ఘనంగా న్యూ ఇయర్ డాన్స్ ఫెస్ట్



**కొత్తపల్లి మండలం, డిసెంబర్ 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ సాలెహ్‌నగర్‌లోని ట్రినిటీ ది స్కూల్ ఆఫ్ లెర్నింగ్ ప్రాంగణంలో బుధవారం నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని న్యూ ఇయర్ డాన్స్ ఫెస్ట్ ఘనంగా జరిగింది. తరగతులు 1 నుండి 9 వరకు విద్యార్థుల కోసం నిర్వహించిన సోలో డాన్స్ పోటీ, పాఠశాల సహ పాఠ్య కార్యక్రమాల భాగంగా 2026 నూతన సంవత్సరానికి ఉత్సాహభరిత స్వాగతం పలికింది. కార్యక్రమానికి చైర్మన్ దాసరి ప్రశాంత్ రెడ్డి, డైరెక్టర్ డా. దాసరి మమతా రెడ్డి, ప్రిన్సిపల్ రత్నమాలా బెహేరా, అకడమిక్ కోఆర్డినేటర్ శ్రీకాంత్ ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులను ప్రోత్సహించారు. ఈ సందర్భంగా చైర్మన్ ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ, ట్రినిటీలో విద్యా ప్రతిభతో పాటు సమగ్ర వ్యక్తిత్వ వికాసానికి సమాన ప్రాధాన్యం ఇస్తాం. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, సృజనాత్మకతను పెంపొందిస్తాయి అని అన్నారు. డైరెక్టర్ మమతా రెడ్డి విద్యార్థుల అంకితభావాన్ని ప్రశంసిస్తూ, తమ అభిరుచులను కొనసాగించాలని సూచించారు. ప్రిన్సిపల్ రత్నమాలా బెహేరా విద్యార్థులు, ఉపాధ్యాయుల కృషిని అభినందించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించగా, ఆనందం, ప్రేరణతో కూడిన వాతావరణంలో కార్యక్రమం ముగిసింది. ట్రినిటీ స్కూల్ నూతన సంవత్సరం 2026ను ఉత్సాహంగా స్వాగతించేందుకు సిద్ధమైందని ఈ వేడుక మరోసారి చాటి చెప్పింది.

# ఎస్సీ హాస్టల్లో జరిగిన ఘటన కారణంగా హాస్టల్ వార్డెన్ సస్పెండ్



**భూపాలపల్లి, డిసెంబర్ 31**
(నీలగిరి ఎక్స్‌ప్రెస్): భూపాలపల్లి కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌లో విద్యార్థిని కొట్టిన ఘటనపై వార్డెన్‌ను సస్పెండ్ చేసి, పోలీస్ కేసు నమోదు చేసినట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. జిల్లా కలెక్టర్ స్వయంగా హాస్టల్‌ను తనిఖీ చేసి విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. డిగ్రీ చదువుతున్న విద్యార్థినిని కొట్టడం బాధాకరమని పేర్కొంటూ, తక్షణమే ఎస్సీ అభివృద్ధి అధికారితో విచారణ జరిపి వార్డెన్‌ను సస్పెండ్ చేసినట్లు వెల్లడించారు. ప్రాథమిక విచారణలో విధుల్లో నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యం స్పష్టమైనందున వార్డెన్‌పై శాఖాపరమైన చర్యలతో పాటు క్రిమినల్ కేసు కూడా నమోదు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. బాధిత విద్యార్థినితో పాటు ఇతర విద్యార్థినులకు కౌన్సెలింగ్ అందించి, భద్రతను మరింత కట్టుదిట్టం చేయాలని నిర్ణయించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ హాస్టళ్లు, రెసిడెన్షియల్ స్కూళ్లలో నిరంతర పర్యవేక్షణ కోసం ప్రత్యేక అధికారులను నియమించినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఎస్సీ అభివృద్ధి అధికారి ఇందిర, సంక్షేమ అధికారి మల్లేశ్వరి, డీఈఓ రాజేందర్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా అయ్యప్ప స్వామి మండల పూజా కార్యక్రమం



**కామారెడ్డి, డిసెంబర్ 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కామారెడ్డి శ్రీశ్రీశ్రీ అయ్యప్ప స్వామి దేవాలయంలో 36వ మండల పూజా మహోత్సవం భక్తిశ్రద్ధల మధ్య అత్యంత వైభవంగా జరిగింది. ఈ పవిత్ర కార్యక్రమానికి కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ముఖ్య అతిథులుగా హాజరై ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించి అయ్యప్ప స్వామి ఆశీస్సులు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అయ్యప్ప స్వామి అనుగ్రహంతో ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఇలాంటి ధార్మిక కార్యక్రమాలు సమాజంలో శాంతి, ఐక్యత పెంపొందిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# ఉప సర్పంచును ఘనంగా సన్మానించిన తపస్ మంచాల మండల బృందం



**మంచాల మండలం, డిసెంబర్ 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఇటీవల జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఆరుట్ల గ్రామ ఉప సర్పంచ్‌గా బాధ్యతలు స్వీకరించిన నూకం విజయకుమార్ (రాజు) ముదిరాజ్ గారిని తపస్ మంచాల మండల బృందం ఘనంగా సన్మానించింది. వారి స్వగృహంలో జరిగిన ఈ కార్యక్రమంలో తపస్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పూజరి రమేశ, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రావుల శివకుమార్, కావలి దత్తాత్రేయ, అలాగే తపస్ జిల్లా, మండల బాధ్యులు రావుల వెంకటేష్, చీర ఐలయ్య, శేఖర్ సార్, రాజ వర్ధన్ రెడ్డి, చిందం శ్రీశైలం, వెంకటేష్ తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, గ్రామ అభివృద్ధి కోసం ఉప సర్పంచ్ విజయకుమార్ కృషి చేస్తారని, ప్రజలతో సమన్వయం సాధించి పంచాయతీని మరింత ముందుకు తీసుకెళ్తారని ఆకాంక్షించారు.

# వైశ్య భవన్‌లో విజయవంతంగా ముగిసిన లలిత సహస్రనామ పారాయణం



**కరీంనగర్, డిసెంబర్ 31(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కరీంనగర్‌లో డిసెంబర్ 27, 28 తేదీల్లో రెండు రోజుల పాటు వైశ్య భవన్‌లో శ్రీ భగవద్గీత సంపూర్ణ పారాయణం, లలిత సహస్రనామ గళపారాయణం అంగరంగ వైభవంగా జరిగింది. వివిధ జిల్లాల నుండి దాదాపు 1500 మంది భక్తులు హాజరై అత్యంత భక్తి శ్రద్ధలతో పారాయణంలో పాల్గొన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల నుండి స్వామీజీలు, పీఠాధిపతులు హాజరై ఆధ్యాత్మిక, ధార్మిక ప్రవచనాలు గావించి భక్తులను ఆధ్యాత్మికతలో ముంచెత్తారు. కార్యక్రమానికి ఆర్య వైశ్య సేవకేంద్రం అనుమతి ఇచ్చి, భక్తి వాతావరణంలో విజయవంతంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా నిర్వహణ కమిటీ తరపున ముఖ్యంగా ఆర్థిక సహాయం చేసిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎలాంటి ఇబ్బంది కలిగితే క్షమించమని కోరారు. గీత భక్త సమాజం కరీంనగర్ అధ్యక్షుడు బండ సత్తయ్య, సభ్యులు కలిసి ఈ మహోత్సవాన్ని విజయవంతం చేశారు.

# సానిటేషన్ కార్మికుల వేతనాలు ఇవ్వాలని సిఐటియు డిమాండ్



**మంథని, డిసెంబర్ 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మంథని ప్రభుత్వ ఆసుపత్రి మరియు మాత శిశు కేంద్రంలో పనిచేస్తున్న సానిటేషన్ కార్మికులు అక్టోబర్ నెల వేతనాలు ఇప్పించాలని సిఐటియు ఆధ్వర్యంలో హాస్పటల్ సూపరింటెండెంట్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కమిటీ సభ్యుడు బూడిద గణేష్ మాట్లాడుతూ, ధర్నా నిర్వహించిన ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం బకాయి వేతనాలు విడుదల చేసినప్పటికీ కాంట్రాక్టర్ కార్మికులకు అక్టోబర్ నెల వేతనాలు ఇవ్వలేదని తెలిపారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ప్రభుత్వం విడుదల చేసిన వేతనాలు కార్మికులకు అందజేయాలని, ప్రతి కార్మికునికి పిఎఫ్ సక్రమంగా అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సానిటేషన్ కార్మికులు భారత్, రమాదేవి, లలిత, రాజబాబు, సిఐటియు నాయకులు బాబు రవి తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపిన రాష్ట్ర స్వర్ణకార సంఘం నాయకులు

**రామగుండం, డిసెంబర్ 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
స్వర్ణకారుల సమస్యలను అసెంబ్లీ వేదికగా ప్రస్తావించి ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చిన రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కన్ సింగ్‌ను తెలంగాణ రాష్ట్ర స్వర్ణకార సంఘం నాయకులు మణికొండలోని ఆయన నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ప్రపంచీకరణ, కార్పొరేటీకరణ ప్రభావంతో వృత్తులు కోల్పోయి ఉపాధి లేక ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్న విశ్వబ్రాహ్మణుల సమస్యలను ఎమ్మెల్యే అసెంబ్లీలో ప్రస్తావించారని, దీనిని ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చినందుకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వింజమూరి రాఘవచారి



ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకుని విశ్వకర్మలను ఆదుకోవాలని వారు కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ, తాను చిన్ననాటి నుంచి విశ్వకర్మ కుటుంబాలతో కలిసి పెరిగానని, వారి కష్టాలు తనకు దగ్గరగా తెలుసని అన్నారు. ఒకప్పుడు వెలుగొందిన విశ్వబ్రాహ్మణ జాతి నేడు కార్పొరేటీకరణ ప్రభావంతో సంక్షోభంలోకి వెళ్లిందన్న ఆవేదనతోనే అసెంబ్లీలో ఈ అంశాన్ని ప్రస్తావించానని తెలిపారు. ముఖ్యమంత్రితో మాట్లాడగా సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని వెల్లడించారు. కార్యక్రమంలో రాష్ట్ర స్వర్ణకార సంఘం అధ్యక్షుడు వింజమూరి రాఘవచారి, ప్రధాన కార్యదర్శి చెవురి వెంకటస్వామి, కార్యదర్శి సతీష్ చారి, సలహాదారులు, సహాయక కార్యదర్శులు పాల్గొన్నారు.

# మిరాసిపల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు బూట్లు బ్యాగుల పంపిణీ



**వనపర్తిడిసెంబర్ 31( నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మిరాసిపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినీ విద్యార్థులకు బూట్లు, బ్యాగులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖ అధికారి మహమ్మద్ అబ్దుల్ ఘని హాజరయ్యారు.డీఈఓ హాజరుపై పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి ఆనందం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో పేద విద్యార్థులకు ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం తృప్తికరమని డీఈఓ అన్నారు.ఈ కార్యక్రమంలో నూతనంగా ఎన్నుకోబడిన గ్రామ సర్పంచ్ కర్నాటి వైదేహి ఉప సర్పంచ్ రాజు,వార్డు మెంబర్లు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# పింక్ డేనూతన సంవత్సర వేడుకలతో తపస్విని కిడ్స్ సందడి




**వనపర్తి డిసెంబర్ 31(నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
వనపర్తి జిల్లా కేంద్రంలోని తపస్విని కిడ్స్ ప్లే స్కూల్లో పింక్ డే కార్యక్రమం, నూతన సంవత్సర వేడుకలు ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు గులాబీ రంగు దుస్తుల్లో మెరిసిపోతూ "పింక్ డే  కైండ్ ఆల్వేస్ ", "వేర్ పింక్, షో యు కేర్ " అనే నినాదాలతో పాఠశాల ప్రాంగణాన్ని ఆనందోత్సాహాలతో నింపారు.అనంతరం ఒక రోజు ముందుగానే నూతన సంవత్సర వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. కేక్ కటింగ్ చేసి, మిఠాయిలు పంచుకుంటూ చిన్నారులు ఉల్లాసంగా గడిపారు. ఈ కార్యక్రమాలు పిల్లల్లో స్నేహభావం, ప్రేమ, పంచుకోవడం వంటి మానవీయ విలువలను పెంపొందిస్తాయని పాఠశాల నిర్వాహకులు తెలిపారు.పిల్లల చిలిపి నవ్వులు, ఉత్సాహం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

# బీసీ జాక్ పేరుతో అక్రమాలు

**- సతీష్ యాదవ్**



**వనపర్తి డిసెంబర్ 31( నీలగిరి ఎక్స్ ప్రెస్)**
:వనపర్తిలో జరుగుతున్న పరిణామాలపై డా. సతీష్ యాదవ్ అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షులు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. బీసీజాక్ పేరుతో గత కొన్నేళ్లుగా వనపర్తిని కేంద్రంగా చేసుకుని అక్రమాలు, బ్లాక్‌మైలింగ్, నకిలీ సర్టిఫికెట్ల వ్యవహారాలు జరిగాయని ఆరోపించారు. ఈ వ్యవహారాల్లో పాల్గొన్న వ్యక్తి జైలుకు వెళ్లిన విషయం ప్రజలకు తెలిసిందేనని అన్నారు.శాకాపురం ఒక రైస్ మిల్ యజమాని తన మిల్లు ప్రయోజనాల కోసం ఒక వ్యక్తిని ముందుకు నెట్టి బర్త్‌డే కార్యక్రమం నిర్వహించారని, ఒక అధికారిపై ఒత్తిడి తెచ్చిన అంశాన్ని మాత్రమే తాము ప్రస్తావించామని తెలిపారు. అధికారి తప్పు చేస్తే చట్టమే చర్యలు తీసుకుంటుందన్నారు.వనపర్తిలో జరిగిన సభకు డబ్బులు ఎలా వచ్చాయో తమకు తెలుసునని, బీసీజాక్ పేరుతో అగ్రవర్ణాల చెప్పుచేతల్లో పనిచేస్తున్న వాస్తవాలు ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉందన్నారు. రెండు రోజుల్లో అన్ని ఆధారాలతో వివరాలు వెల్లడిస్తామని, ప్రస్తుతం టూర్‌లో ఉన్నానని తెలిపారు.

# నర్సాపూర్‌లో ఉచిత పశు వైద్య శిబిరం



**ఎలిగేడు, డిసెంబర్ 31(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఎలిగేడు మండలంలోని నర్సాపూర్ గ్రామంలో బుధవారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువైద్యురాలు ఝాన్సీ మాట్లాడుతూ గ్రామంలోని పశువుల ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. శిబిరంలో 650 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మాత్రలు అందజేయడం జరిగింది.గ్రామ సర్పంచ్ పల్లెర్ల వెంకటేష్ గౌడ్, గోపాల మిత్ర సమ్మయ్య తదితరులు పాల్గొని రైతులకు తోడ్పాటు అందించారు. ఈ శిబిరం ద్వారా పశువుల ఆరోగ్య సంరక్షణకు ఒక దిశానిర్దేశం లభించిందని, పశువుల ఉత్పాదకత పెంపొందించడంలో ఇది కీలకమని భావిస్తున్నారు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించిన కలెక్టర్





**హైమావతి సిద్దిపేట, డిసెంబర్ 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
దుబ్బాక మున్సిపల్ పరిధిలో ఎలక్టోరల్ మ్యాపింగ్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ కె. హైమావతి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మున్సిపాలిటీ కార్యాలయంలో జరిగిన సమీక్షలో ఆమె మాట్లాడుతూ, ఎలక్టోరల్ మ్యాపింగ్‌ను 100 శాతం పూర్తి చేయాలని, బిల్ కలెక్టర్లు, సూపర్‌వైజర్లు, బిఎల్‌ఓలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో రెండు చోట్ల ఓటు ఉన్నవారిని వెరిఫై చేసి ఒక్క ప్రాంతంలోనే ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తరువాత మిరుదొడ్డి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి వైద్య సేవలను పరిశీలించారు. ఓపి రిజిస్టర్, అటెండెన్స్ రిజిస్టర్,



ఫార్మాసి గది, ల్యాబ్ గదిని తనిఖీ చేసి, మందులు సమయానికి అందుబాటులో ఉండాలని, కాలం చెల్లిన మందులు వాడరాదని, పరీక్షల కోసం పరికరాలు సిద్ధంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. గర్భిణీ మహిళలను నేల వారిగా మానిటర్ చేసి ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవం అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అల్వాల గ్రామంలోని రైతు వేదికలో యూరియా కార్డుల పంపిణీ ప్రక్రియను కూడా కలెక్టర్ పరిశీలించారు. యాసంగి సీజన్‌లో ఎక్కడా యూరియా కొరత రాకుండా అన్ని సెంటర్లలో బస్తాలు అందుబాటులో ఉంచుతున్నామని, ఒక ఎకరాకు రెండు బస్తాల చొప్పున పంపిణీ జరుగుతుందని తెలిపారు. కౌలు రైతులు కూడా పాస్‌బుక్ లేదా జిరాక్స్‌తో వస్తే యూరియా అందిస్తామని హామీ ఇచ్చారు. సామాజిక మాధ్యమాల్లో వస్తున్న యూరియా కొరత కథనాలను నమ్మవద్దని, ప్రతి రైతుకు సరిపడా యూరియా అందించేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ పర్యటనలో వ్యవసాయ శాఖ అధికారులు, స్థానిక వైద్య సిబ్బంది, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

# ' పట్నం ' నియోజకవర్గ ప్రజలకు ఇంగ్లీష్ నూతన సంవత్సర శుభాకాంక్షలు

**2026 నూతన సంవత్సరంలో ప్రజలందరికీ మంచి జరగాలి**
**కొత్త సంవత్సరంలో అందరూ కొత్త ఆశలతో ముందుకు సాగాలి**
**చెడును వదిలిపెట్టి... మంచిని స్వీకరించాలి**
**పెద్ద అంబర్పేట్ మున్సిపల్ తాజా మాజీ కౌన్సిలర్ దేవిడి గీత వేణుగోపాల్ రెడ్డి**



**ఇబ్రహీంపట్నం, డిసెంబర్ 31 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
ఇంగ్లీషు 3026 నూతన సంవత్సరంలో ప్రజలందరికీ మంచి జరగాలని పెద్ద అంబర్పేట్ మున్సిపల్ తాజా మాజీ కౌన్సిలర్ దేవిడి గీత వేణుగోపాల్ రెడ్డి ఆకాంక్షించారు. 2026 ఇంగ్లీష్ నూతన సంవత్సరం పురస్కరించుకొని వారు ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ప్రజానీకానికి, పెద్ద అంబర్పేట్ డివిజన్ ప్రజలకు 2026 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం వారు ఒక ప్రకటనలో మాట్లాడుతూ.. ఈ 2026వ సంవత్సరంలో ప్రజలందరికీ మంచి జరగాలని కోరుకుంటున్నట్లు వారు తెలిపారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు ప్రతి పౌరునికి చేరుతూ నూతన సంవత్సరం నూతన ఆలోచనలతో ప్రతి ఒక్కరూ అభివృద్ధిలోకి రావాలని అందరి ఆకాంక్షలు నెరవేరాలని తాము ఆకాంక్షిస్తున్నట్టు తెలిపారు. 2025 ఏడాదిలో ఎదురైన అనుభవాలను దృష్టిలో పెట్టుకొని నూతన ఏడాదిలో మరింత పట్టుదల కృషితో సవాళ్ళను అధిగమించి విజయాలను కైవసం చేసుకోవాలని అన్నారు. కొత్త సంవత్సరంలో అందరూ కొత్త ఆశలతో ముందుకు సాగాలని అన్నారు. కొత్త సంవత్సరంలో ప్రజలంతా సుఖ,సంతోషాలతో పాడిపంటలతో, అష్టైశ్వర్యాలతో సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ ఏడాది ప్రజల జీవితాల్లో సుఖ,సంతోషాలు కలిగి ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ నూతన సంవత్సరంలో నూతన ఆలోచన విధానంతో ముందుకెల్లాలని అన్నారు. 2026 సంవత్సరం ప్రజల ఆనందాల సంవత్సరం కావాలని, ప్రతి ఇంటా సుఖ,సంతోషాలు వెల్లివిరియాలని, సిరిసంపదలు సమృద్ధిగా కలగాలని ఆకాంక్షించారు. గత అనుభవాలను నెమరు వేసుకుంటూ పొరపాట్లకు తావు లేకుండా నూతన ఆలోచనలతో ప్రజలంతా ముందుకు సాగాలన్నారు. 2026 నూతన సంవత్సరం ప్రతి ఒక్కరికీ గెలుపు నందించే సంవత్సరం కావాలని కోరుకుంటూ ప్రజలందరికీ వారు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సరంలో ప్రతి ఒక్కరూ తమకంటూ ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకొని వాటిని సాధించే దిశగా ముందుకు సాగాలన్నారు. ప్రజలందరికీ వారు 2026 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

# వికసిత్ భారత్ యంగ్ లీడర్‌షిప్‌కు ఎంపికైన కోడూరి విప్లవ

**సన్మానించిన సర్పంచ్ కప్పల ప్రవీణ్**



**ఎలిగేడు, డిసెంబర్ 31(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఎలిగేడు మండల కేంద్రానికి చెందిన కోడూరి విప్లవ, భారత ప్రభుత్వం వివేకానంద జయంతి పురస్కరించుకొని నిర్వహిస్తున్న వికసిత్ భారత్ యంగ్ లీడర్‌షిప్ కంపిటిషన్‌లో ఎంపికై విశేష గౌరవాన్ని సాధించింది. దేశవ్యాప్తంగా 50 లక్షల మంది విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీల్లో, మొదటి రౌండ్ క్విజ్‌లో 2,50,000 మంది, రెండవ రౌండ్ వ్యాసరచనలో 1,50,000 మంది ఎంపిక కాగా, మూడవ రౌండ్‌లో తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఆరుగురు విద్యార్థులు అర్హత సాధించారు. వారిలో ముగ్గురిని ప్రెజెంటేషన్ రౌండ్‌కు ఎంపిక చేయగా, అందులో విప్లవ ఒకరిగా నిలిచింది.ఈ నెల 12వ తేదీన దేశ రాజధాని ఢిల్లీలోని భారత్ మండపంలో జరగనున్న యూత్ డే సెలెబ్రేషన్స్లో, "సుస్థిరమైన మరియు వికసిత్ భారత్" అనే అంశంపై దేశ ప్రధాని నరేంద్ర మోడీ సమక్షంలో కోడూరి విప్లవ తన ప్రతిభను ప్రదర్శించనుంది.విప్లవ ఎంపిక కావడం ఎలిగేడు మండలానికి గర్వకారణమని, భవిష్యత్తులో కూడా ఆమె మరిన్ని విజయాలు సాధించి ఎలిగేడుకు మంచి పేరు తెస్తుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం సర్పంచ్ కప్పల ప్రవీణ్ శాలువాతో ఘనంగా సన్మానం చేశారు.ఈ కార్యక్రమంలో 2వ వార్డ్ సభ్యులు పల్లె కార్తీక్, బోయిని సుమన్, కప్పల సతీష్, అడ్డగుంట తిరుపతి గౌడ్, ఖమ్మం నరేష్, బుర్ర శ్రీనివాస్ గౌడ్, బుర్ర అజయ్, ముంజంపల్లి అనిల్, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడమే ప్రధాన లక్ష్యం

**-దూళికట్ట సర్పంచ్ మారం కొమురయ్య**



**ఎలిగేడు, డిసెంబర్ 31(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఎలిగేడు మండలంలోని దూళికట్ట గ్రామంలో నూతన సర్పంచ్ మారం కొమురయ్య అధ్యక్షతన గ్రామసభ నిర్వహించబడింది. గ్రామ ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ఈ సభలో ముఖ్యంగా డ్రైనేజీ, తాగునీటి సమస్య, కరెంటు స్ట్రీట్ లైట్లు, సిసి రోడ్ల నిర్మాణం వంటి అంశాలను చర్చించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మారం కొమురయ్య మాట్లాడుతూ, అధికారుల సమన్వయంతో గ్రామ సమస్యలను పరిష్కరించి, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి పేదవారికి అందేలా కృషి చేస్తామని తెలిపారు. ప్రజల అభ్యున్నతే తన ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.గ్రామసభలో ఉప సర్పంచ్ మేచినేని అండాలు సత్యనారాయణరావు, గ్రామ కార్యదర్శి పున్నమయ్య, వార్డు సభ్యులు, అన్ని విభాగాల అధికారులు, మహిళా సంఘాల అధ్యక్షులు, గ్రామస్తులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నట్టల నివారణ మందును సద్వినియోగం చేసుకోవాలి

**సర్పంచ్ ముచ్చర్ల సుగుణ సంపత్**



జీవానికి నట్టల నివారణ మందు వేస్తున్న సర్పంచ్ ముచ్చర్ల సుగుణా

**యాచారం,డిసెంబర్ 31 (నీలగిరి ఎక్స్ ప్రెస్) :**
మేకలు, గొర్రెలకు ఉచిత నట్టల నివారణ మందు పంపిణీ కార్యక్రమాన్ని పశువుల పెంపకం దారులు సద్వినియో గం చేసుకొవాలని మేడిపల్లి పశువెఏద్యాధికారి కిరణ్ కుమార్ అన్నారు. బుధవారం యాచారం మండలం లోని నక్కర్త –మేడిపల్లి గ్రామంలో పశువైద్యాధికారి కిరణ్ కుమార్ సర్పంచ్ ముచ్చర్ల సుగుణా,సంపత్ తో కలిసి ఉచిత నట్టల నివారణ మందు పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్బంగా సర్పంచ్ మాట్లాడుతూ పశువులకు వచ్చే వ్యాధుల నివారణకు యజమానులు నట్టల నివారణ మందు వేయించాలని సూచించారు. గ్రామాల్లో నిర్వహించే పశు వైద్యశిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యాధులు ప్రబలకుండా ఉంటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మోటే శ్రీశైలం , కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు జమ్మ గుండాలు,చింటూ గౌడ్, నల్లోల్ల చంద్రయ్య , పశువైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

## వెల్దండ మండల ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన సర్పంచ్ మట్ట యాదమ్మ, మట్ట వెంకటయ్య గౌడ్



**వెల్దండ, డిసెంబర్ 31(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
వెల్దండ మండల సర్పంచ్ మట్ట యాదమ్మ, మట్ట వెంకటయ్య గౌడ్ 2026 నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని మండల ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. కొత్త సంవత్సరంలో అందరూ సుఖశాంతులతో, ఆనందోత్సాహాలతో జీవించాలని, నూతన వేడుకలను ఘనంగా జరుపుకోవాలని, ప్రతి ఒక్కరూ సోదరభావంతో కలిసిమెలిసి ఉండాలని ఆకాంక్షించారు.అదేవిధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, కె.వి.ఎన్. రెడ్డి మరియు వెల్దండ మండల ప్రజలకు కూడా నూతన సంవత్సర శు భాకాంక్షలు తెలియజేశారు.కొత్త సంవత్సరం వెల్దండ ప్రజలకు అభివృద్ధి, ఐక్యత, సుఖశాంతులను తీసుకురావాలని సర్పంచ్ మట్ట యాదమ్మ, మట్ట వెంకటయ్య గౌడ్ ఆకాంక్షించారు.

# నూతన ఆంగ్ల సంవత్సర శుభాకాంక్షలు



**యాచారం, డిసెంబర్ 31 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికలలో తాడిపర్తి గ్రామంలో సర్పంచ్ గా నిలం ఝాన్సి , రమేష్ బీజేపీ విజయం సాధించిన శు భ సందర్భంగా మేడిపల్లి లో హైదరాబాద్ గ్రీన్ ఫార్మసిటీ పోలీస్ స్టేషన్ లో సీఐ, సత్యనారాయణ, ఎస్సై సైదులును మర్యాదపూర్వకంగా కలిపి శాలువాలతో సత్కరించిన ఆంగ్ల నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు బిజెపి నాయకులు నీలం రమేష్ . ఈ సంధ్భంగా రమేష్ మాట్లాడుతూ ... కొత్త సంవత్సరం ఆరంభం కానున్న తరుణంలో ప్రజలకు నూతన ఆంగ్ల సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. 2026 సంవత్సరం ప్రజలంతా సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. నూతన సంవత్సర వేడుకలను ప్రతి ఒక్కరూ ఆనందంగా ఉల్లాసంగా జరుపుకోవాలని కోరారు. అదే సమయంలో డిసెంబర్ 31 రాత్రి శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా తగు జాగ్రత్తలు పాటిస్తూ వేడుకలు నిర్వహించుకోవాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం రహదారులపై అల్లరి అనవసరమైన గొడవలు శబ్ద కాలుష్యం కలిగించే కార్యకలాపాలు నిర్వహించకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ప్రజల భద్రతే ప్రభుత్వ లక్ష్యమని పోలీసు శాఖకు సహకరించి శాంతియుత వాతావరణంలో కొత్త సంవత్సరాన్ని స్వాగతించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంగం శ్రీనాథ్, నాయకులు, యువకులు తదితరులు ఉన్నారు.

# భారత వైఖరిని తీవ్రంగా తప్పుపట్టిన జెలెన్‌స్కీ



**కీవ్:డిసెంబర్ 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ నివాసంపై ఉక్రెయిన్ డ్రోన్ దాడి చేసినట్లు వచ్చిన వార్తలను భారత్‌తో సహా పలు దేశాలు ఖండించిన విషయం తెలిసిందే. అయితే భారత ప్రధాని మోదీ చేసిన ఖండనను ఉక్రెయిన్ తప్పుపట్టింది. కొన్ని దేశాలు గందరగోళంగా, అసహ్యకరంగా ప్రవర్తిస్తున్నాయని, పుతిన్ ఇంటిపై డ్రోన్ దాడి ఘటనను ఖండిస్తున్నట్లు ఇండియా, యూఏఈ దేశాలు పేర్కొన్నాయని, వాస్తవానికి ఆ దాడి జరగలేదని ఆన్‌లైన్ మీడియా సమావేశంలో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తెలిపారు.డిసెంబర్ 28వ తేదీ రాత్రి పుతిన్ ఇంటిపై ఉక్రెయిన్ సుమారు 91 కమికేజ్ లాంగ్ రేంజ్ డ్రోన్లతో దాడి చేసినట్లు రష్యా విదేశాంగ మంత్రి లవ్రోవ్ తెలిపారు. నోవ్‌గోరాడ్ ప్రాంతంలో ఉన్న పుతిన్ ఇంటిపై అటాక్ జరిగినట్లు ఆయన పేర్కొన్నారు. ఆ దాడిలో ఎవరికీ ఏమీకాలేదన్నారు. భౌతిక నష్టం కూడా జరగలేదన్నారు. అన్ని యూఏవీలను రష్యా కూల్చివేసిందన్నారు. అయితే ఆ దాడి తాము చేయలేదని ఉక్రెయిన్ నేత జెలెన్‌స్కీ వెల్లడించారు. రష్యా చేస్తున్న దాడులతో మా పిల్లలు మరణిస్తున్నారని, ఇలాంటి సంఘటనలను ఏ దేశం కూడా ఖండించడం లేదని, ఇండియా కానీ లేక యూఏఈ కానీ ఆ ఘటనలను ఖండించడం లేదని జెలెన్‌స్కీ అన్నారు.

## రాష్ట్ర ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన వ్యవసాయ కమిషన్ సభ్యులు కేవీఎన్ రెడ్డి



**హైదరాబాద్, డిసెంబర్ 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యులు కేవీయన్ రెడ్డి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సహా రాష్ట్ర ప్రజలందరికీ 2026 నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రజల జీవితాల్లో కొత్త ఆశలు, లక్ష్యాలు, సంతోషకరమైన ఆరంభం కలగాలని ఆకాంక్షించారు.కేవీయన్ రెడ్డి మాట్లాడుతూ నూతన సంవత్సరం అనేది ఒక సంవత్సరం ముగిసి కొత్త సంవత్సరం ప్రారంభమయ్యే రోజు అని, ప్రపంచవ్యాప్తంగా జనవరి 1న ఈ వేడుకలు ఘనంగా జరుగుతాయని పేర్కొన్నారు. కొత్త ఆశలు, కొత్త లక్ష్యాలు, సంతోషకరమైన ఆరంభాన్ని సూచించే ఈ వేడుకలు ప్రజల జీవితాల్లో ఆనందాన్ని నింపుతాయని అన్నారు.అదేవిధంగా మన సాంప్రదాయ పండుగలలో ఉగాది ప్రత్యేక స్థానం కలిగి ఉందని, హిందువులు దానిని ఘనంగా జరుపుకుంటారని గుర్తుచేశారు. ప్రపంచవ్యాప్తంగా జనవరి 1న జరుపుకునే నూతన సంవత్సరం వేడుకలు కూడా ప్రజలలో ఉత్సాహాన్ని, ఉల్లాసాన్ని నింపుతాయని ఈ సందర్భంగా తెలిపారు.

# ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో రాణించాలి





## ఆంగ్ల నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ చేసిన ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి



**ఎల్బీనగర్ , డిసెంబర్ 31 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో ముందుకు రావాలని , రాజకీయంగా ఎదగాలని ఇబ్రహింపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. బుధవారం కర్మన్ ఘాట్ లోతెలంగాణా రాష్ట్ర ఆర్య వైశ్య మహాసభ ఆత్మీయ సమావేశం మరియు 2026 నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం రాష్ట్ర అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ గుప్త అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సంధ్భంగా వారు మాట్లాడుతూ.... తెలంగాణా రాష్ట్ర ప్రజలకు ఆర్యవైశ్యులకు ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఆర్యవైశ్యులకు ఏ సమస్య వచ్చినా అదుకుంటామని ... వ్యాపారంతో పాటు ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. నిరుపేద ఆర్యవైశ్య కుటుంబాలకు చేయూత అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ ఆర్గనైజింగ్ కార్యదర్శి రేణుకుంట్ల గణేష్ గుప్తా, కోశాధికారి కొండ్ల మల్లికార్జున్ గుప్త , తెలంగాణ రాష్ట్ర రాజకీయ కమిటీ చైర్మన్ చింతల రవి కుమార్ గుప్త రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ఉప్పల శారద , రాష్ట్ర నాయకులు పసునూరి శ్రీనివాస్ గుప్త తదితరులు పాల్గొన్నారు.

# సోదరుడి కుమారుడికి కుమార్తెను ఇచ్చి పెళ్లి చేసిన పాక్ ఆర్మీ చీఫ్ !



**రావల్పిండి:డిసెంబర్ 31 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ జనరల్ అసిమ్ మునీర్ తన మూడవ కుమార్తె వివాహం చేశారు. డిసెంబర్ 26వ తేదీన రావల్పిండిలో సైనిక ప్రధానకార్యాలయంలో ఆ పెళ్లి వేడుక జరిగింది. అయితే తన సోదరుడి కుమారుడికే.. తన కూతుర్ని ఇచ్చి అసిమ్ మునీర్ పెళ్లి చేసినట్లు తెలుస్తోంది. దీనిపై స్థానిక జర్నలిస్టులు కొన్ని కథనాలు రాశారు. ఆ పెళ్లిని చాలా గోప్యంగా నిర్వహించినట్లు పేర్కొన్నారు. సీనియర్ రాజకీయనేతలు, సైనిక అధికారులు ఆ మ్యారేజీకి హాజరయ్యారు. సెక్యూర్టీ కారణాల వల్ల వేడుకను చాలా సైలెంట్‌గా చేశారు. పెళ్లికి చెందిన అధికారిక ఫోటోలు ఇంకా రిలీజ్ కాలేదు.ఫీల్డ్ మార్షల్ సయ్యద్ అసిమ్ మునీర్‌కు నలుగురు కూతుళ్లు ఉన్నారు. దాంట్లో మహనూర్ మూడవ కుమార్తె. కెప్టెన్ అబ్దుల్ రెహ్మాన్ ఖాసిమ్‌ను ఆమె పెళ్లి చేసుకున్నది. సుమారు 400 మంది అతిథులు హాజరైనట్లు తెలుస్తోంది. ప్రెసిడెంట్ ఆసిఫ్ అలీ జర్దారీ, పీఎం షెహబాజ్ షరీఫ్, డిప్యూటీ పీఎం ఇషాక్ దార్ ఉన్నారు. పెళ్లికుమారుడు అబ్దుల్ రెహ్మాన్ గతంలో పాకిస్థాన్ ఆర్మీలో కెప్టెన్‌గా చేశారు. మిలిటరీ సర్వీసు ముగిసిన తర్వాత అతను సివిల్ అడ్మినిస్ట్రేషన్‌లో చేరారు. ఆర్మీ ఆఫీసర్ల కోటాలో ఆయన ఉద్యోగంలో చేరాడు. ప్రస్తుతం అసిస్టెంట్ కమీషనర్‌గా కొనసాగుతున్నారు.

# బిజినెస్

# 2025 సంవత్సరానికి శుభం కార్డు

## ఈ ఏడాది జనవరి 1 నుంచి డిసెంబర్ 31 వరకు బంగారం, వెండి ధర ఎంత పెరిగిందో తెలుసా? పూర్తి వివరాలు




దేశంలో బంగారం, వెండి ధరలు భగ్గుమంటున్న తరుణంలో నిన్నటి నుంచి తగ్గుముఖం పడుతున్నాయి. తులం బంగారం ధర దాదాపు 1,42,000 వరకు వెళ్లి బంగారం ధర.. మంగళవారం నుంచి క్రమంగా దిగి వస్తున్నాయి. వెండి కూడా అంతే ధర రూ.1,70,000 వరకు వెళ్లిన వెండి ధర.. ఇప్పుడు భారీగానే దిగి వస్తోంది. ప్రస్తుతం డిసెంబర్ 31న బంగారం ధరలు భారీగా దిగి వచ్చాయి. ప్రస్తుతం తులం బంగారం ధర రూ.1,35,880 వద్దకు చేరుకుంది. అదే విధంగా కిలో వెండి ధర రూ.2,40,000 వేల వద్ద కొనసాగుతోంది. ఈ ఏడాదిలో బంగారం, వెండి ఎంత పెరిగింది?ఈ ఏడాది 2025 జనవరి 1వ తేదీన దేశీయంగా 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.78,000 ఉండగా, అదే 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.71,500 వద్ద కొనసాగింది. ప్రస్తుతం తులం ధర రూ.1,35, 880 వద్ద ఉంది. ఇదే విధంగా వెండి కిలోకు రూ.90,000 వద్ద ఉండేది. ప్రస్తుతం రూ.2,40,000 వద్ద కొనసాగుతోంది.

## లాభాల్లో ముగిసిన సూచీలు

ముంబై,
గత నాలుగు సెషన్లుగా నష్టాలతోనే పయనం సాగించిన దేశీయ సూచీలు బుధవారం మాత్రం లాభాల జోరు అందుకుని 2025 సంవత్సరానికి శుభం పలికాయి. ముఖ్యంగా స్టీల్ స్టాక్స్ భారీ లాభాలను అందుకోవడం సూచీలకు కలిసొచ్చింది. అలాగే క్రూడాయిల్ ధరలు కాస్త తగ్గుముఖం పట్టడం, కనిష్టాల వద్ద మదుపర్లు కొనుగోళ్లకు మొగ్గు చూపడం, అంతర్జాతీయంగా సానుకూల సంకేతాలు మార్కెట్లను ముందుకు నడిపాయి. దీంతో సెన్సెక్స్, నిఫ్టీ భారీ లాభాలతో రోజును ముగించాయి

గత సెషన్ ముగింపు (84, 675)తో పోల్చుకుంటే బుధవారం ఉదయం 100 పాయింట్లకు పైగా లాభంతో మొదలైన సెన్సెక్స్ రోజుంతా అదే జోష్‌ను



కొనసాగించింది. మధ్యాహ్నం తర్వాత ఆ లాభాలు మరింత పెరిగాయి. ఒక దశలో సెన్సెక్స్ 750 పాయింట్లకు పైగా లాభపడి 85, 437 వద్ద ఇంట్రాడే గరిష్టానికి చేరుకుంది. చివరకు సెన్సెక్స్ 545 పాయింట్ల లాభంతో 85, 220 వద్ద రోజును ముగించింది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే కదలాడింది. చివరకు 190 పాయింట్ల లాభంతో 26, 129 వద్ద స్థిరపడింది

÷న్సెక్స్‌లో హిందుస్థాన్ పెట్రో, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, సెయిల్, బీపీసీఎల్, ఎల్ అండ్ టీ, ÷నాన్స్ మొదలైన షేర్లు లాభాలు ఆర్జించాయి. వోడాఫోన్ ఐడియా, హిందుస్థాన్ జింక్, పీబీ ఫిన్‌టెక్, టీసీఎస్, కెఫిన్ టెక్నాలజీస్ మొదలైన షేర్లు నష్టాలను మూటగట్టుకున్నాయి. బ్యాంక్ నిఫ్టీ 410 పాయింట్లు లాభపడింది. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 570 పాయింట్లు ఎగబాకింది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ 89.87గా ఉంది.

# 2026కు ఆటో కిక్కు!

### కొత్త ఏడాదిలో సరికొత్త కార్లు
### రాకజనవరిలోనే జోరుగా అప్‌డేటెడ్ మాడళ్లు

**న్యూఢిల్లీ,**
నూతన సంవత్సరంపై దేశీయ ఆటోమొబైల్ సంస్థలు గంపెడాశలు పెట్టుకున్నాయి. ఇప్పటికే పలు వాహనాలను విడుదల చేసి కొనుగోలుదారులను ఆకట్టుకుంటున్న కంపెనీలు.. వచ్చే ఏడాది తొలి నెలలోనే అర డజనుకుపైగా అప్‌డేటెడ్, కొత్త వాహనాలను విడుదల చేయడానికి సిద్ధమవుతున్నాయి. కార్ల తయారీలో అగ్రగామి సంస్థలైన మారుతి సుజుకీ, టాటా మోటర్స్, కియా, మహీంద్రాలు వీటిని అందుబాటులోకి తీసుకురాబోతున్నాయి. ఇందులో ఎస్‌యూవీలు, ఈవీ మాడళ్లూ ఉన్నాయి. ఆ వివరాల్లోకి వెళ్తే..సెల్టోస్: కొరియాకు చెందిన ఆటోమొబైల్ దిగ్గజం కియా.. దేశీయ మార్కెట్లోకి సరికొత్త సెల్టోస్‌ను అందుబాటులోకి



తీసుకురాబోతున్నది. మధ్యస్థాయి ఎస్‌యూవీ మాడల్ అయిన ఈ సెల్టోస్‌ను కావాలనుకునేవారు ముందస్తుగా రూ.25 వేలు చెల్లించి బుకింగ్ చేసుకోవాల్సి ఉంటుంది. 1.5 లీటర్ పెట్రోల్, డీజిల్ ఇంజిన్‌తో తయారైన ఈ కారు ధరను జనవరి 2న కంపెనీ ప్రకటించనున్నది.ఈ-విటారా: దేశీయంగా ఈవీలకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని మారుతి సుజుకీ తన పంథాను మార్చుకున్నది. ఇప్పటివరకు కేవలం పెట్రోల్, డీజిల్ వాహనాలపై దృష్టి సారించిన సంస్థ.. తాజాగా తన తొలి ఎలక్ట్రిక్ కారును అందుబాటులోకి తీసుకురాబోతున్నది. ఇప్పటికే ఆటో ప్రదర్శనలో చూపిన ఈ-విటారాను వచ్చే నెలలో మార్కెట్లో ప్రవేశపెట్టబోతున్నది. మూడు రకాల్లో లభించనున్న ఈ కారును 49 కిలోవాట్లు, 61 కిలోవాట్ల బ్యాటరీతో తీర్చిదిద్దింది. సింగిల్ చార్జింగ్‌తో 543 కిలోమీటర్ల వరకు ప్రయాణించగలదు.డస్టర్: ఫ్రెంచ్ ఆటో దిగ్గజం రెనాల్ట్.. మార్కెట్లోకి సరికొత్త డస్టర్‌ను తీసుకురాబోతున్నది. వచ్చే నెల చివర్లో అందుబాటులోకి రానున్న ఈ కారు 1.3 లీటర్ టర్బో పెట్రోల్ ఇంజిన్‌తో పరిచయం కానున్నది.కుషక్: మార్కెట్లోకి మధ్యస్థాయి ఎస్‌యూవీ మాడల్ కుషక్‌ను విడుదల చేయబోతున్నది స్కోడా ఇండియా. పాత మాడల్‌ను మరింత ఆధునీకరించి విడుదల చేస్తున్నది. దీంట్లో పానోరమిక్ సన్‌రూఫ్, 360 డిగ్రీ పార్కింగ్ కెమెరా, లెవల్ 2 అడాస్ సిస్టమ్ తదితర నూతన ఫీచర్లున్నాయి.

# సిక్సర్ల కింగ్ విధ్వంసం..

# స్పోర్ట్స్

### 4000 పరుగులతో వరల్డ్ రికార్డు..
### బిగ్ బాష్ లీగ్‌లో నంబర్ 1 వీడే

ఆస్ట్రేలియా విధ్వంసక బ్యాటర్ క్రిస్ లిన్ బిగ్ బాష్ లీగ్‌లో తన ప్రతాపాన్ని మరోసారి చూపించాడు. 2025 సంవత్సరం ముగింపు వేళ ఆస్ట్రేలియా గడ్డపై సిక్సర్ల సునామీ సృష్టించి అభిమానులకు అదిరిపోయే విందును అందించాడు. బ్రిస్బేన్ హీట్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో అడిలైడ్ స్ట్రైకర్స్ తరపున బరిలోకి దిగిన లిన్.. ప్రత్యర్థి బౌలర్లను ఊచకోత కోస్తూ తన జట్టుకు భారీ విజయాన్ని అందించాడు. కేవలం మ్యాచ్ గెలవడమే కాదు, ఈ క్రమంలో ఎవరికీ సాధ్యం కాని ఒక అరుదైన రికార్డును కూడా తన ఖాతాలో వేసుకున్నాడు.ఈ మ్యాచ్‌లో అడిలైడ్ స్ట్రైకర్స్ కెప్టెన్ మాథ్యూ షార్ట్ పరుగులు చేయడానికి తడబడగా, క్రిస్ లిన్ మాత్రం క్రీజులోకి వచ్చిన క్షణం నుంచే బంతిని బౌండరీల అవతలికి పంపడం మొదలుపెట్టాడు. కేవలం 41 బంతుల్లో 79 పరుగులు చేసి అజేయంగా



నిలిచాడు. ఇందులో 6 సిక్సర్లు, 6 ఫోర్లు ఉన్నాయి. 190కి పైగా స్ట్రైక్ రేట్‌తో బ్యాటింగ్ చేసిన లిన్ ధాటికి, 122 పరుగుల లక్ష్యాన్ని అడిలైడ్ జట్టు మరో 35 బంతులు మిగిలి ఉండగానే అలవోకగా ఛేదించింది. నాలుగో ఓవర్లో మిడ్ వికెట్ మీదుగా లిన్ బాదిన సిక్సర్ స్టేడియంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ఈ మెరుపు ఇన్నింగ్స్ ద్వారా క్రిస్ లిన్ బిగ్ బాష్ లీగ్‌లో 4000 పరుగుల మైలురాయిని చేరుకున్న తొలి ఆటగాడిగా చరిత్ర సృష్టించాడు. ఇప్పటివరకు 131 మ్యాచ్‌ల్లో 4065 పరుగులు చేసిన లిన్, ఈ లీగ్‌లో తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తున్నాడు. ఇందులో ఒక సెంచరీ, 32 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. మరీ ముఖ్యంగా, బీబీఎల్ చరిత్రలో 200 కంటే ఎక్కువ సిక్సర్లు (226) కొట్టిన ఏకైక ఆటగాడు కూడా ఇతనే. 151 సిక్సర్లతో గ్లెన్ మాక్స్‌వెల్ రెండో స్థానంలో ఉన్నాడంటే, లిన్ రేంజ్ ఏంటో అర్థం చేసుకోవచ్చు. లిన్ గతంలో ఐపీఎల్‌లో కూడా 42 మ్యాచ్‌ల్లో 1329 పరుగులు చేసి సత్తా చాటాడు.లీగ్ క్రికెట్‌లో ఇంతటి ఘనమైన రికార్డు ఉన్నప్పటికీ, క్రిస్ లిన్ అంతర్జాతీయ క్రికెట్‌లో మాత్రం ఆ స్థాయిలో రాణించలేకపోయాడు. ఆస్ట్రేలియా తరపున 18 టీ20లు ఆడి కేవలం 291 పరుగులు మాత్రమే చేశాడు. ఇందులో ఒక్క హాఫ్ సెంచరీ కూడా లేకపోవడం గమనార్హం. అలాగే 4 వన్డేల్లో 75 పరుగులు చేశాడు. గాయాలు, నిలకడలేమి కారణంగా జాతీయ జట్టులో ఎక్కువ కాలం ఉండలేకపోయినప్పటికీ, టీ20 ఫ్రాంచైజీ లీగ్స్‌లో మాత్రం లిన్ ఇప్పటికీ మోస్ట్ వాంటెడ్ బ్యాటర్ గానే కొనసాగుతున్నాడు.

## 6 కిలోల బరువు తగ్గిన శ్రేయాస్ అయ్యర్.. కివీస్‌తో వన్డేలకు డౌటే



**ముంబై**
స్టార్ బ్యాటర్ శ్రేయాస్ అయ్యర్ గ్రౌండ్‌లో అడుగుపెట్టడం మరింత ఆలస్యం అయ్యే అవకాశాలు ఉన్నాయి. ఆస్ట్రేలియాతో జరిగిన వన్డే సిరీస్‌లో అతను గాయపడ్డ విషయం తెలిసిందే. క్యాచ్ అందుకోబోయి కింద పడ్డ అయ్యర్‌కు .. కడుపులో మోచేయి వత్తేసింది. దీంతో అతని ప్లీహం(స్ప్లీన్) దెబ్బతిన్నది. దాని నుంచి రక్తస్రావం జరిగింది. అయితే ప్రమాదం నుంచి ఇంకా కోలుకుంటున్న శ్రేయాస్ అయ్యర్.. న్యూజిలాండ్‌తో జరిగే వన్డే సిరీస్‌కు అందుబాటులో ఉంటాడన్న అనుమానాలు వ్యక్తం అయ్యాయి. కానీ ఓ నివేదిక ప్రకారం మాత్రం ప్రమాదం తర్వాత అయ్యర్ సుమారు ఆరు కిలోల బరువు తగ్గినట్లు తెలుస్తోంది. అతని మాంస కణజాలం తగ్గడం వల్ల బరువు చాలా వేగంగా కోల్పోయినట్లు డాక్టర్లు చెబుతున్నారు.విజయ్ హజారే ట్రోఫీలో శ్రేయాస్ అయ్యర్ ఆడే అవకాశాలు ఉన్నట్లు ఓ మీడియా కథనాన్ని రాసింది. జనవరి 3, 6వ తేదీల్లో జరిగే మ్యాచుల్లో అతను ఆడుతాడని డౌట్ వ్యక్తం చేసింది. దీంతో కివీస్‌తో జరిగే వన్డే సిరీస్‌కు అయ్యర్ అందుబాటులో ఉంటాడని కూడా ఊహాగానాలు వినిపించాయి. అయితే శ్రేయార్ అయ్యర్ 50 ఓవర్ల మ్యాచ్ ఆడగలడా లేదా అన్నది సందేహంగా ఉన్నట్లు బీసీసీఐ వర్గాలు చెబుతున్నాయి. కడుపు సర్జరీ కావడం వల్ల అతను ఫిజికల్‌గా గ్రౌండ్‌లో గడపడం ఎంత వరకు వీలు అవుతుందో తెలియదన్నారు. కానీ శ్రేయాస్ మాత్రం స్కిల్ ట్రైనింగ్ ప్రారంభించాడు. ప్రస్తుతం అతని ఆరోగ్యం నిలకడగానే ఉన్నది. 50 ఓవర్లకు తగినట్లు అతను ఫీల్డింగ్ చేయగలిగితే అప్పుడు విజయ్ హజారేలో ఆడే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు.

# కోమాలో ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్

**సిడ్నీ:**
ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ డామియన్ మార్టిన్.. కోమాలోకి వెళ్లారు. 54 ఏళ్ల వయసున్న ఆ మాజీ బ్యాటర్.. బాక్సింగ్ డే రోజున కోమాలోకి వెళ్లినట్లు తెలుస్తోంది. మెనింజిటిస్ వ్యాధితో బాధపడుతున్న అతను క్వీన్స్‌ల్యాండ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మిడిల్ ఆర్డర్ బ్యాటర్ అయిన డామియన్ మార్టిన్ ఆస్ట్రేలియా జాతీయ జట్టు తరపున 67 టెస్టులు, 208 వన్డేలు ఆడాడు. ప్రస్తుతం డేమియన్ మార్టిన్‌కు ఇండ్యూస్డ్ కోమా పద్ధతిలో చికిత్స అందిస్తున్నారు. ఆసీస్ మాజీ క్రికెటర్లు సోషల్ మీడియాలో రియాక్ట్ అవుతున్నారు. మార్టిన్‌కు అత్యుత్తమ చికిత్స అందిస్తున్నారని, ఫ్యామిలీ ధైర్యంగా ఉండాలని ఆడమ్ గిల్‌క్రిస్ట్ తెలిపారు.1992 నుంచి



2006 మధ్య కాలంలో ఆస్ట్రేలియా తరపున డామియన్ మార్టిన్ 67 టెస్టులు ఆడాడు.2000 సంవత్సరంలో ఆరేళ్ల గ్యాప్ తర్వాత అతన్ని మళ్లీ జట్టులోకి తీసుకున్నారు. స్టీవ్ వా నేతృత్వంలోని ఆసీస్ జట్టులో అతను కీలక బ్యాటర్‌గా కొనసాగాడు. 2006 యాషెస్ సిరీస్ మధ్యలో అతను అకస్మాత్తుగా రిటైర్ అయ్యాడు. టెస్టుల్లో అతను 46 సగటుతో 4406 పరుగులు చేశాడు. దీంట్లో 13 సెంచరీలు ఉన్నాయి. 2003లో ఆస్ట్రేలియా వన్డే వరల్డ్‌కప్ గెలిచింది. ఆ జట్టులో మార్టిన్ ఉన్నాడు. ఇండియాతో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో మార్టిన్ 88 రన్స్ చేసి నాటౌట్‌గా నిలిచాడు. రికీ పాంటింగ్‌తో కలిసి 234 రన్స్ భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. వన్డేల్లో డామియన్ మార్టిన్ 40 సగటుతో 5346 రన్స్ చేశాడు. దీంట్లో అయిదు సెంచరీలు ఉన్నాయి.